## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

RNI NO:APTEL16151






JANASAMUDRAM.COM

సంపుటి: 03 | సంచిక : 256 | బుధవారం, ఏప్రిల్ 16, 2025 | ఎడిటర్: వేణుగోపాల్ రెడ్డి | పేజీలు : 8 | వెల: రూ.2


## తొలిసారిగా సోనియా, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్

మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ

కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ యూనిట్ చీఫ్ శామ్ పిట్రోడా పేరును కూడా చేర్చిన ఈడీ

ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ



## కృష్ణా జలాల్లో ఏపీ వాడకం 72.2%

తెలంగాణ వాడకం 27.8 శాతమే

66:34 నిష్పత్తిలో పంపిణీ జరిపినా తెలంగాణకు 68 టీఎంసీల నష్టం

50:50 నిష్పత్తిలో పంపిణీ చేస్తే 235 టీఎంసీల నష్టం

కృష్ణా బోర్డు గణాంకాలతో నీటిపారుదల శాఖ నివేదిక






## ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు..

పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది.

పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కుంటారు"

సీఎల్పీ సమావేశంలోఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్

భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కేటగిరైజేషన్‌పై చర్చ

హైదరాబాద్: పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం.. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది. మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. అలా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కుంటారు" అంటూ రేవంత్ తేల్చి చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు. సీఎల్పీ సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కేటగిరైజేషన్‌పై చర్చ జరిగింది. ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేల దుమ్మా కొట్టారు. వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, రాజగోపాల్‌రెడ్డి గైర్హాజరయ్యారు. సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని పిలుపునిచ్చారు. "ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. సన్నబియ్యం పథకం ఒక అద్భుతం.. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకం. భూ భారతిని రైతులకు చేరవేయాలి. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదర్శంగా నిలిచింది. క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలి. దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించాం. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో


(మిగతా 2వ పేజీలో)

## నెం.2 స్థానంలో ఉన్నామంటే మనం ఇంకా గట్టిగా కృషి చేయాలని అర్థం: సీఎం చంద్రబాబు

అభివృద్ధి పథంలో దూసుకెళుతున్న ఏపీ

దేశంలోనే నెంబర్ 2గా ఆంధ్రప్రదేశ్

సోషల్ మీడియాలో స్పందించిన సీఎం చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2024-25 ఏడాదికి గాను ఆర్థిక వృద్ధి రేటు పరంగా దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన కొన్ని నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధి పరంగా దూసుకెళుతున్నట్టు ఈ జాతీయ నివేదిక చెబుతోంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "1990 ప్రాంతంలో నేను మొట్టమొదట ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉంది. అప్పుడు బెంగళూరు నెంబర్ వన్ స్థానంలో ఉంది. కానీ ఇవాళ చూస్తే అన్ని రంగాల్లో హైదరాబాద్ నగరం నెంబర్ వన్ అయింది. అదే విధంగా, ఇవాళ మన ముందు ఒక కొత్త సవాలు లేదా కొత్త అవకాశం మన ముందు నిలిచింది. దీన్ని మనం అందిపుచ్చుకుని ముందుకెళ్లాలి. నెంబర్ 2 స్థానంలో ఉన్నామంటే మనం ఇంకా గట్టిగా కృషి చేయాలని అర్థం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.





## దుబాయ్‌లో తెలంగాణవాసుల హత్య

మృతుల్లో ఒకరిది నిర్మల్ జిల్లా, మరొకరిది జగిత్యాల జిల్లా

విద్వేషంతో నరికి చంపిన పాకిస్తానీ

విదేశాంగ అధికారులతో మాట్లాడిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్

మృతదేహాలను త్వరగా భారత్‌కు తీసుకురావాలని వినతి

పొట్టకూటి కోసం దుబాయ్ వలస వెళ్లిన ఇద్దరు తెలంగాణ వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. వీరు దుబాయ్‌లోని అల్‌క్వ్యాజ్ ప్రాంతంలో మోడర్న్ బేకరీలో పనిచేస్తున్నారు. వీరితోపాటు అక్కడే పనిచేస్తున్న పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తి వీరిని కత్తితో విచక్షణారహితంగా నరికి చంపారు. మతవిద్వేషంతోనే వారిని చంపినట్లు అక్కడ ఉంటున్న తెలంగాణవాసులు చెప్పారు. బేకరీలో శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాకిస్తానీ దాడిలో నిర్మల్ జిల్లాకు చెందిన ఆష్టపు ప్రేమ్‌సాగర్ (40), జగిత్యాల జిల్లాకు చెందిన శ్రీనివాస్ మరణించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన దేగాం సాగర్‌కు గాయాలయ్యాయి. సాగర్‌ను సహోద్యోగులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడి ఘటనకు సంబంధించిన

(మిగతా 2వ పేజీలో)

## రేవంత్ సర్కార్‌ను కూలిస్తే బీజేపీకి ఏం లాభం?

:::కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొడితే బీజేపీకి వచ్చే లాభం ఏంటని ఆయన ప్రశ్నించారు. తొందరపడి తెలంగాణలో ప్రభుత్వాన్ని కూలగొట్టమని కిషన్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రభుత్వానికి ఐదేళ్లు సమయం ఉంది. ప్రభుత్వాన్ని కూల గొట్టడానికి గుజరాత్ వ్యాపారులకు పని లేదా? వ్యాపారులు వాళ్ళ వ్యాపారాలు వాళ్ళు చేసుకుంటున్నారు

(మిగతా 2వ పేజీలో)




## ఉన్నత విద్య సలహామండలిలో పారిశ్రామికవేత్తలకు చోటు: మంత్రి నారా లోకేశ్

ఏపీ ప్రభుత్వం-సీఐఐ ఏపీ శాఖ ఉమ్మడి కన్సల్టేటివ్ కమిటీ తొలి సమావేశం

ముఖ్యఅతిధిగా పాల్గొన్న నారా లోకేశ్

5 ఏళ్లలో 3 లక్షలమంది స్కిల్డ్ వర్కర్లను సిద్ధం చేస్తామని వెల్లడి

మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉన్నత విద్యలో డిజిటల్ స్కిల్స్ పెంపొందించేందుకు వీలుగా ఉన్నతవిద్య సలహా మండలిలో పారిశ్రామికవేత్తలకు చోటు కల్పిస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఏపీ ప్రభుత్వం-సీఐఐ ఏపీ శాఖ ఉమ్మడి కన్సల్టేటివ్ కమిటీ తొలి సమావేశంలో మంత్రి లోకేశ్ ముఖ్యఅతిధిగా

(మిగతా 2వ పేజీలో)

# తెలంగాణ వాడకం 27.8 శాతమే

**66:34 నిష్పత్తిలో పంపిణీ జరిపినా తెలంగాణకు 68 టీఎంసీల నష్టం**

**50:50 నిష్పత్తిలో పంపిణీ చేస్తే 235 టీఎంసీల నష్టం**

**కృష్ణా బోర్డు గణాంకాలతో నీటిపారుదల శాఖ నివేదిక**




హైదరాబాద్: ప్రస్తుత నీటి సంవత్సరం (2024-25)లో ఏపీ, తెలంగాణ మొత్తం 990.38 టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకోగా, అందులో ఏకంగా 72.2 శాతం (715.03 టీఎంసీలు) ఏపీ వాడుకుంది. తెలంగాణ 275.35 టీఎంసీల (27.8 శాతం)ను మాత్రమే వినియోగించుకోగలిగింది. రెండు రాష్ట్రాల వాడకంపోగా, ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో కనీస నిల్వ మట్టానికి(ఎండీడీఎల్) ఎగువన 9.17 టీఎంసీలతోపాటు ఇతర జలాశయాల్లో మరో 43.94 టీఎంసీలు కలిపి మొత్తం 53.12 టీఎంసీలే మిగిలి ఉన్నాయి. ఈ లెక్కన ప్రస్తుత నీటి సంవత్సరంలో మొత్తం 1043.5 టీఎంసీల జలాల లభ్యత ఉందని కృష్ణా బోర్డు తేల్చింది. గత సోమవారం నాటికి రెండు రాష్ట్రాలు వాడిన కృష్ణా జలాలకు సంబంధించి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) రూపొందించిన గణాంకాలతో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈమేరకు ఓ నివేదిక తయారుచేసింది.

**50:50 నిష్పత్తిలో అయితే..**

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశం కృష్ణా ట్రిబ్యునల్-2లో పెండింగ్‌లో ఉంది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు తాత్కాలిక సర్దుబాటు ప్రకారం ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలో నీటి పంపకాలు జరుగుతుండగా, 50:50 నిష్పత్తిలో పంపకాలు జరపాలని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. అలా అయితే, 1043.5 టీఎంసీల్లో ఏపీ, తెలంగాణకు చెరో 521.75 టీఎంసీల హక్కులుంటాయి. దీంతో కృష్ణా జలాల్లో తెలంగాణకు ఇంకా 246.4 టీఎంసీల వాటా మిగిలి ఉంటుంది. ఏపీ వాటికి మించి 235.01 టీఎంసీలను వాడుకోవడంతో ఆ మేరకు నీటి వాటాను తెలంగాణ నష్టపోయింది.

**66:34 నిష్పత్తిలో తెలంగాణకి 68 టీఎంసీల నష్టం**

తాత్కాలిక సర్దుబాటు ప్రకారం 66:34 నిష్పత్తిలో పంపకాలు జరిపినా 1043.5 టీఎంసీల్లో ఏపీకి 688.714 టీఎంసీలు, తెలంగాణకి 354.79 టీఎంసీల వాటా లభించాలి. ఈ లెక్కన తెలంగాణ ఈ ఏడాది వాడుకున్న జలాలు పోగా ఇంకా 77.22 టీఎంసీలను వాడుకోవడానికి హక్కు కలిగి ఉండనుంది. ఏపీ వాటాకి మించి 68.05 టీఎంసీలను వాడుకోవడంతో తెలంగాణ ఆ మేరకు నీటి వాటాను కోల్పోయింది. ఉమ్మడి జలాశయాల్లో మిగిలి ఉన్న మొత్తం 9.17 టీఎంసీలను తెలంగాణకే కేటాయించినా హక్కుగా లభించాల్సిన వాటాల్లో మరో 68.05 టీఎంసీల లోటును రాష్ట్రం ఎదుర్కోనుంది.

**పోతిరెడ్డిపాడు నుంచి 208 టీఎంసీల మళ్లింపు**

శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 208.64 టీఎంసీలు, మల్యాల లిఫ్టు ద్వారా 28.36 టీఎంసీలు, మల్యాల నుంచి కేసీ కాల్వకి 1.19 టీఎంసీలు, ముచ్చుమర్రి లిఫ్టు ద్వారా 3.49 టీఎంసీలు, చెన్నైకి నీటి సరఫరాకి 1.88 టీఎంసీలు కలిపి ఏపీ మొత్తం 243.58 టీఎంసీలను వాడుకుంది. ఇక నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 29.45 టీఎంసీలు, కుడి కాల్వ ద్వారా 188.16 టీఎంసీలు కలిపి మరో 217.62 టీఎంసీలను ఏపీ వాడుకుంది. ఇలా ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు ఏపీ మొత్తం 715.03 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకున్నట్టు బోర్డు లెక్క గట్టింది.

**అరకొరగానే తెలంగాణ వాడకం**

శ్రీశైలం నుంచి కల్వకుర్తి లిఫ్టు ద్వారా 46.75 టీఎంసీలు, చెన్నైకి నీటి సరఫరాకి 0.94 టీఎంసీలు కలిపి మొత్తం 47.69 టీఎంసీలను మాత్రమే తెలంగాణ వాడుకుంది. సాగర్ నుంచి ఏఎమ్మార్పీ ప్రాజెక్టు అవసరాలకు 41.42 టీఎంసీలు, ఎడమ కాల్వ ద్వారా 115.48 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 14.37 టీఎంసీలు కలిపి మొత్తం 171.28 టీఎంసీలను రాష్ట్రం వాడుకుంది. జూరాల ప్రాజెక్టు నుంచి మరో 42.25 టీఎంసీలు, ఇతర ప్రాజెక్టుల నుంచి మరో 8.42 టీఎంసీలు కలిపి ఈ ఏడాది తెలంగాణ మొత్తం 275.35 టీఎంసీలను మాత్రమే వాడుకోగలిగింది.

# రేవంత్ సర్కార్‌ను కూలిస్తే బీజేపీకి ఏం లాభం?

అని వ్యాఖ్యానించారు. తాజాగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే ఉద్దేశ్యం మాకు లేదు. దీంతో, బీజేపీకి వచ్చే లాభమేమీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది. అది అందరికీ తెలుసు. వచ్చే ఎన్నికల్లో గెలుపు బీజేపీదే. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై ఎటువంటి తొందర లేదు. త్వరలో కొత్త అధ్యక్షుడి నియామకం జరుగుతుంది. భూములు అమ్మకం, మద్యం అమ్మకం, అప్పులు తేవడంలో తెలంగాణను నంబర్ వన్‌గా మార్చారు. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి ఇలా చెట్లు నరికిన ఘటనలు దేశంలో తెలంగాణలో తప్ప ఎక్కడ జరగలేదు. హెచ్‌సీయూలో చెట్లు కొట్టిన %ూ×% వీడియో పోస్టుపై కేసు పెడితే పెట్టుకోండి. భావితరాలకు ల్యాండ్ కాపాడాల్సిన బాధ్యత మనపైన ఉంది. భూములు అమ్మకం ద్వారానే ప్రభుత్వం నడపాలని అనుకోవద్దు. రేవంత్ ఏ బ్రాండ్ అనేది వచ్చే ఎన్నికల్లో తేలుతుంది. నేషనలిజమే నా బ్రాండ్. ప్రాజెక్ట్ పూర్తి కాకుండా ఎస్ఎల్‌బీసీపై నేషనల్ డ్యాం సెక్యూరిటీ అథారిటీకి ఎలా ఫిర్యాదు చేస్తాం?. సింగరేణి కార్మికులకు ఐటీ పన్నులు మేం అధికారంలోకి వస్తే రియింబర్స్ చేస్తాం. సింగరేణి కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేస్తారు. వాళ్లది వైట్ కాలర్ జాబ్ కాదు.

**ప్రభుత్వాన్ని కూలగొడితే బీజేపీకి లాభం ఎంటి?: కిషన్ రెడ్డి**

సన్నబియ్యంపై.. ఏ రాష్ట్రంలోనైనా ఆ రాష్ట్ర ప్రజల అవసరానికి అనుగుణంగా ఇస్తాం. కొన్ని రాష్ట్రాల్లో గోధుమలు కూడా సరఫరా చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కోటా కాకుండా ప్రతీ లబ్దిదారుడికి అదనంగా ఐదు కేజీల సన్న బియ్యం ఇచ్చి చూపించాలి. దొడ్డు బియ్యం పైసలతోనే సన్న బియ్యం ఇస్తున్నారు. దీంట్లో కొత్తగా ఏముంది? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలలో తమిళనాడులో నష్టపోయామని.. అక్కడ పొత్తుకు వెళ్లాం. య అధ్యక్షుడిగా నా పేరు ప్రచారంపై అటువంటి ప్రస్తావనే లేదు. దక్షిణాదికి లోక్ సభ సీట్లు తగ్గుతాయనేది గాలి ప్రచారం మాత్రమే. అన్యాయంగా వక్ఫ్ పేరుతో ఆక్రమించిన భూముల కోసమే కొంతమంది ఆందోళనలు చేస్తున్నారు. ఎంఐఎం నేతలు, అక్రమంగా లబ్ది పొందిన వారే ఆందోళనల్లో ఉన్నారు. ఏ ఒక్క సామాన్య, పేద ముస్లిం కూడా ఆందోళన చేయడం లేదు. వక్ఫ్ సవరణ చట్టం మీద భూ బకాసురులు ఉద్యమం చేస్తున్నారు. ముస్లిం ప్రార్థన మందిరాలను, వక్ఫ్‌కు సంబంధం లేదు' అని అన్నారు.



# ఈసీ తీరు అనుమానాస్పదం

**ఓటర్ల డేటా ఎందుకివ్వరు? మండిపడ్డ పార్టీలు, సంస్థలు .. ఈసీ ప్రతినిధులతో సమావేశం .. ఈవీఎంలపై అన్నీ అనుమానాలే**

**ట్యాంపరింగ్ జరుగుతున్నట్టు ఆరోపణలు.. పోలింగ్‌శాతాల్లోనూ అనూహ్య తేడాలు రాత్రికల్లా భారీగా పెరుగుతున్నాయి ..**

**ఏ ప్రశ్నకూ భేటీలో బదుల్లేదు: సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ .. సుప్రీంకోర్టుకు నివేదిస్తామని వెల్లడి**

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై పలు పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మండిపడ్డాయి. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు సంస్థ పూర్తిగా తిలోదకాలిస్తోందంటూ ధ్వజమెత్తాయి. "ఓటింగ్‌కు సంబంధించి పౌరులందరికీ తెలియాల్సిన గణాంకాలను అడిగినా బయటపెట్టడం లేదు. ఎన్నికల ప్రక్రియలో భారీ అవకతవకలు జరుగుతున్నాయన్న అనుమానాలు ఈసీ తీరుతో నానాటికీ బలపడుతున్నాయి" అంటూ దుయ్యబట్టాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల శాతానికి సంబంధించిన పూర్తి గణాంకాలను బయట పెట్టాల్సిందిగా అవి డిమాండ్ చేస్తుండటం తెలిసిందే. ఈ విషయమై అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్)తో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా తదితరులు సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు కూడా దాఖలు చేశారు. 2019 ఎన్నికల్లో నమోదైన మొత్తం ఓట్లకు సంబంధించి 17సీ పార్ట్%-%1 తాలూకు ప్రతులన్నింటినీ వెల్లడించేలా ఈసీని ఆదేశించాలని కోరారు. దీనిపై తొలుత ఈసీని సంప్రదించాల్సిందిగా గత నెల కోర్టు వారికి సూచించింది. దాంతో ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఆహ్వానం మేరకు మంగళవారం సమావేశం జరిగింది. ఏడీఆర్ ప్రతినిధులతో పాటు సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్, మొయిత్రా తదితరులు భేటీలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈసీ తీరుపై పెదవి విరిచారు.




**సీఈసీ, ఈసీ ఎక్కడ: భూషణ్**

సీఈసీ గానీ, ఎన్నికల కమిషనర్లు గానీ భేటీలో పాల్గొనకపోవడాన్ని ప్రతినిధులు తీవ్రంగా తప్పుబట్టారు. "ఏదో అత్యున్నత న్యాయస్థానం సూచించింది గనుక తప్పలేదన్నట్టుగా వ్యవహరించారు. భేటీకి కేవలం ఈసీ ప్రతినిధులను పంపి సరిపెట్టారు. సంస్థ విశ్వసనీయతకు సంబంధించిన అతి కీలకమైన సమస్య విషయంలో వారి చిత్తశుద్ధి ఏపాటిదో దీన్నిబట్టే తేలిపోతోంది. అయినా సుప్రీంకోర్టుపై గౌరవంతో మా అనుమానాలన్నింటినీ ఈసీ ప్రతినిధుల ముందుంచాం.

2019 లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ శాతానికి సంబంధించిన డేటాలో చాలా అవకతవకలున్నట్టు వారి దృష్టికి తీసుకెళ్లాం. వాటిపై సమాధానాలు కోరాం. ఫాం 17(సీ), 20 వంటివాటిని వెబ్‌సైట్లో అందరికీ అందుబాటులో ఉంచాల్సిందిగా సూచించాం. కానీ వారినుంచి సానుకూల స్పందనే లేదు" అంటూ ప్రశాంత్ భూషణ్ పెదవి విరిచారు. దీనిపై తమ తదుపరి వాదనలను ఇక సుప్రీంకోర్టు ముందే ఉంచుతామని స్పష్టం చేశారు.

"ఓటింగ్ విషయంలో తప్పిదాలు, అవకతవకలు జరుగుతున్నాయని, ఈవీఎంల టాంపరింగ్ జరుగుతోందని దేశవ్యాప్తంగా చాలా అనుమానాలున్నాయి. అవి వాస్తవమేనంటూ దేశ విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులు గళమెత్తుతున్నారు. ఈసీ ప్రవర్తన ఆ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది" అంటూ భూషణ్ దుయ్యబట్టారు.

**2024లోనూ అవకతవకలు: మొయిత్రా**

2019లోనే గాక 2024 లోక్‌సభ ఎన్నికల విషయంలో కూడా ఓటింగ్‌కు సంబంధించి భారీ అవకతవకలు జరిగాయని మొయిత్రా ఆరోపించారు. "గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ చాలా నియోజకవర్గాల్లో ఈవీఎంలలో నమోదైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు పొంతనే లేదు. సాయంత్రం దాకా ఉన్న పోలింగ్ శాతాలు రాత్రికల్లా భారీగా పెరిగిపోయాయి. చాలాచోట్ల ఈ పెరుగుదల ఏకంగా 20 శాతం దాకా ఉంది" అని గుర్తు చేశారు. ఫలితంగా ప్రస్తుతం ఈసీ విశ్వసనీయత ఎన్నడూ లేనంతగా అడుగంటిందని విమర్శించారు. ముఖ్యంగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విషయంలో ఈసీ పూర్తిగా అప్రతిష్టపాలైందన్నారు. "మేం కోరుతున్నది రహస్య వివరాలేమీ కాదు. దేశప్రజలందరికీ వాటిని తెలుసుకునే హక్కుంది" అని ఆమె స్పష్టం చేశారు.

## ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు..

బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చాం ..ఇది మన పారదర్శక పాలనకు నిదర్శనం. జఠిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం. అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదు. మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతీ గ్రామం పర్యటించేలా కార్యాచరణ తీసుకోవాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికే సమయం కేటాయిస్తా. హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఒక అబద్ధపు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారు.

**మంత్రి పదవి కావాలంటే.. ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్**

..బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మనం ఎంత మంచి చేసినా.. ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోండి. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారు. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారింది. ..కులగణన మోదీకి మరణశాసనం రాయబోతోంది. దేశంలో తెలంగాణ మోడల్ పై చర్చ జరుగుతోంది. అందుకే తెలంగాణలో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయి. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలి. సన్న బియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## దుబాయ్‌లో తెలంగాణవాసుల హత్య

సమాచారాన్ని బయటకు చేరవేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని యాజమాన్యం హెచ్చరించినట్లు వారి బంధువులు చెప్పారు.

**చిన్న బిడ్డను చూడకుండానే..**

నిర్మల్ జిల్లా సోన్ మండలానికి చెందిన ప్రేమ్‌సాగర్ (40) ఇరవై ఏళ్లుగా గల్ఫ్‌లో పనిచేస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం దుబాయ్‌లోని మోడర్న్ బేకరీలో యంత్రం ఆపరేట్ చేసే పనిలో చేరాడు. ప్రేమ్‌సాగర్‌కు తల్లి లక్ష్మి, భార్య ప్రమీల (35), కూతుళ్లు విజ్ఞశ్రీ (9), సహస్ర(2) ఉన్నారు. పదిరోజుల క్రితమే ప్రేమ్‌సాగర్ నాన్నమ్మ ముత్తమ్మ (90) చనిపోయారు. ఆమె పెద్దకర్మ చేసిన శుక్రవారం రోజే ప్రేమ్‌సాగర్ హత్యకు గురయ్యాడు. ప్రేమ్‌సాగర్ మృతి వార్తను ఆయన కుటుంబసభ్యులకు చెప్పలేదు. ప్రేమ్‌సాగర్ తన చిన్నకూతురు సహస్ర తల్లి కడుపులో ఉన్నప్పుడే దుబాయ్ వెళ్లాడు. తను పుట్టినప్పటి నుంచి గ్రామానికి రాలేదు. బిడ్డను చూడకుండానే ఆయన తనువు చాలించడం స్థానికులను కలచివేస్తోంది. కాగా, దుబాయ్‌లో మరణించిన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ (42)కు భార్య మంజుల, ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. శ్రీనివాస్ మృతి విషయం ఆయన తల్లి రాజవ్వకు ఇంకా చెప్పలేదు. ప్రేమ్‌సాగర్ కుటుంబానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అండగా నిలిచారు. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తీసుకురాగవడంతోపాటు నిందితులపై కఠినచర్యలు తీసుకునేలా చూడాలని విదేశాంగ శాఖను కోరారు.

**విదేశాంగ శాఖ మంత్రికి కిషన్‌రెడ్డి లేఖ**

సాక్షి, న్యూఢిల్లీ: ఇద్దరు తెలంగాణ వ్యక్తులను ఓ పాకిస్తానీ హత్య చేసిన ఘటనపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. ఈ విషయంలో చొరవతీసుకుని వీలైనంత త్వరగా మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంలో సహకరించాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన విదేశాంగ మంత్రి జైశంకర్ ఆదేశాలకు అనుగుణంగా దుబాయ్ లోని భారత కాన్సులేట్ అధికారులు.. బుర్ దుబాయ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు వివరాలను తెలుసుకున్నారు. ఉద్దేశపూర్వక హత్యకేసుగా నమోదు చేశామని పోలీసులు వారికి చెప్పారు. కాగా, ఇద్దరు తెలంగాణ కార్మికులు మరణించడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విచారం వ్యక్తం చేశారు. భారత కాన్సులేట్ ద్వారా దుబాయ్ పోలీసులు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఆయన ప్రేమ్ సాగర్ సోదరుడు అష్టపు సందీప్‌తోనూ మాట్లాడారు.

## ఉన్నత విద్య సలహామండలిలో పారిశ్రామికవేత్తలకు చోటు: మంత్రి నారా లోకేశ్

పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఏపీలో ఉన్నత విద్యలో కేవలం 20 శాతం మాత్రమే డిజిటల్ కంటెంట్ ఉందని, ఇది అభివృద్ధి చెందిన దేశాల్లో 70 శాతంగా ఉందన్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు ఉన్నత విద్య కరిక్యులమ్ లో పెద్దఎత్తున మార్పులు చేయాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఒకేషనల్ కోర్సులకు ప్రాధాన్యతనిస్తున్నామని, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా జర్మన్ మోడల్ ఒకేషనల్ కోర్సుల్లో కరిక్యులమ్ రూపొందిస్తామని చెప్పారు. రాబోయే 5 ఏళ్లలో 3 లక్షలమంది స్కిల్డ్ వర్కర్లను సిద్ధం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన పోర్టుల్లో సరుకు ఎగుమతులకు కంటెనర్ల సమస్య ఉందని సీఐఐ ప్రతినిధులు మంత్రి దృష్టికి తెచ్చారు. పారిశ్రామిక సముదాయాలకు సమీపంలో గోదాముల సమస్య అధికంగా ఉందన్నారు. విశాఖ వంటి నగరాలకు సమీపంలో గోడౌన్ల అద్దె భారీగా ఉన్నందున వేర్ హౌసింగ్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ పరిశ్రమదారులు సొంతగా గోడౌన్లు నిర్మించుకుంటే రాయితీలు ఇస్తామని అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినపుడు యాజమాన్యాలపై తీవ్రమైన చర్యలు తీసుకోవద్దని, ఎక్స్ గ్రేషియా విషయంలో ఫ్యాక్టరీస్ శాఖ నిబంధనలను అమలుచేయాలని అన్నారు. అనకాపల్లి%-%ఆనందపురం రోడ్డును 80 మీటర్ల రహదారిగా విస్తరించాలని కోరారు. ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రాపర్టీ ట్యాక్స్ తగ్గించాలని, డేటా సెంటర్లకు గ్రీన్ పవర్ సరఫరాకు చర్యలు తీసుకొని, స్టాండర్డ్ పవర్ టారిఫ్ లు నిర్ణయించాలని సీఐఐ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

## తొలిసారిగా సోనియా, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్



నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్‌లో కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను పేర్కొంది. ఇదివరకే ఈ కేసుతో సంబంధం ఉన్న ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేసింది. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ ఓవర్సీస్ యూనిట్ చీఫ్ శామ్ పిత్రోడా పేర్లను పేర్కొంటూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఏప్రిల్ 25వ తేదీన ప్రత్యేక కోర్టు ఈ కేసును విచారించనుంది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేయడం ఇదే మొదటిసారి. హర్యానాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామం చోటుచేసుకుంది.



**రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ**

సత్తనపల్లి:-సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్ మరియు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం లో అంటరానితనం, వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసి అస్తిత్వ ఉద్యమాలకు దశదిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని ఆశయ సాధనకై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనవిగ్రహానికి మరియు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ కార్యక్రమం లో భాగంగా నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారుఈ కార్యక్రమం లో వివిధ హెూదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





# భక్తి శ్రద్ధలతో జరిగిన క్రిస్మ తైలాల పూజా

జనసముద్రం న్యూస్, జ్ఞానపురం,విశాఖపట్నం,ఏప్రిల్15సెయింట్ పీటర్స్ చర్చ్ లో తపస్సుకాల సన్నాహక ప్రార్ధనలో భాగంగా గురువులు మఠాధిపతులు ఆధ్వర్యంలో క్రిస్మ తైలాల పూజా భక్తి శ్రద్ధలతో జరిగినది,, ఈ ప్రార్ధన కార్యక్రమంలో కతోలిక క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని సెయింట్ పీటర్స్ చర్చ్ భక్త సంఘాల నాయకులు బెత జోసెఫ్ చెప్పారు,,క్రిస్మా తైలాల ప్రతిష్ఠ ఆర్చి బిషప్ రెవరెండ్ బిషప్ డాక్టర్ ఉడుముల బాలశౌరి మరియు విశ్రాంత ఆర్చి బిషప్ మల్లవరపు ప్రకాశ్ గార్ల ఆధ్వర్యంలో 48 గురువుల అర్పణ లో పునీత పేతురు ప్రధాన దేవాలయ ప్రాంగణం లో జరిగినది,



**అసర్ల గంగమ్మ తల్లి జాతర సందర్భంగా టిడిపి కార్యకర్తలు ఇచ్చిన విందుకు హాజరైన డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి**

గాలివీడు జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15

గాలివీడు మండల పరిధిలోని ప్యారంపల్లె, గోపనపల్లి గ్రామాలలో మంగళవారం టిడిపి రాయచోటి నియోజకవర్గ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. అసర్ల గంగమ్మ తల్లి జాతర సందర్భంగా టిడిపి నాయకులు నక్కవాండ్లపల్లి మురళీ, నాగార్జున నాయుడు, కన్నవారి కొత్తపల్లి గీజర్ ఈశ్వర్ రెడ్డి లు ఇచ్చిన విందుకు వారి ఆహ్వానం మేరకు టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. ప్యారంపల్లె, గోపనపల్లి గ్రామాలకు చెందిన టిడిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, గ్రామస్తులు కలిసి తమ అభిమాన నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి గారికి గజమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం టిడిపి కార్యకర్తలు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఈయన వెంట గాలివీడు మండలం టిడిపి నాయకులు. పాల్గొన్నారు.



**ఉపాధి హామీ చట్టం పనులపై రాజకీయ జోక్యాన్ని నివారించాలి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కదిరిప్ప**

తనకల్లు,జన సముద్రం న్యూస్, ఏప్రిల్ 15:-ఉపాధి హామీ చట్టం పారదర్శకంగా అమలు చేయడం కోసం రాజకీయ నాయకుల జోక్యాన్ని పూర్తిగా నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కదిరప్ప తెలిపారు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ఉపాధి కూలీలతో మంగళవారం నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో ఏపీవో లకు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా దాదాపు పది వారాల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే కూలీలకు అందించాలన్నారు. ఉపాధి హామీ పని దినాలను నూరు నుండి 200 రోజులకు పెంచాలన్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో కూలి రేట్లు ఏడు వందల రూపాయలకు పెంచి కూలీల కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. మండలంలో వలసలు అధికమయ్యాయని పనులు కల్పించి వలస పోయిన వారందరినీ తిరిగి గ్రామాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఉపాధి కూలీలకు మౌలిక వసతులతో పాటు ఏవైనా ఆపదలు కలిగినప్పుడు ప్రభుత్వమే ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని ప్రతి కూలికి ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో తనకల్లు మండల కన్వీనర్ రెడ్డప్ప,ఆనందు,రవి,రవి నాయక్ తో పాటు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# కంకర దొంగలను పట్టుకోకుండా ఆర్ఆర్ కుటుంబం పై విమర్శలు చేయడం తగదు

**మా నాయకుడు ప్రమాణం చేయడానికి సిద్ధం**

**ఆర్ ఆర్ కుటుంబాన్ని విమర్శించే స్థాయి నిది కాదు**

**కమిషన్ల కక్కుర్తికి పాల్పడుతూ దోచుకుంటున్నది మీరు కాదా**

**మీడియా సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి**

లక్కిరెడ్డి పల్లె జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15 ...కంకర దొంగలను పట్టుకుని వారికి బుద్ధి చెప్పాల్సింది పోయి , వారిని వెనకేసుకొస్తు ఆర్ ఆర్ కుటుంబాన్ని విమర్శించే స్థాయికి దిగజారడం నీతి మాలిన చర్య అని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ ఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మా నాయకుడు ఆర్ రమేష్ కుమార్ రెడ్డి 11 కోట్లు తీసుకోలేదని రాయచోటి వీరభద్ర స్వామి గుడిలో మీడియా సమక్షంలో ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నాడన్నారు. మీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి 2019 ఎన్నికల్లో వైసిపి పక్కన ఉంటూ టిడిపికి సపోర్ట్ చేస్తానంటూ మా నాయకుడు రమేష్ రెడ్డి అనుచరుల దగ్గర 40 లక్షల రూపాయలు తీసుకోలేదని ప్రమాణం చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. మీ నాయకుడును ప్రమాణం చేయమంటే మీరు చేస్తామంటూ ముందుకు రావడం మీ డొల్లతనం బయటపడుతోందన్నారు. నీ స్థాయి మరిచి ఆర్ఆర్ కుటుంబాన్ని విమర్శించడం తగదని సూటిగా హెచ్చరించారు.1962 నుండి రాజకీయాల్లో ఉంటున్న ఆర్ఆర్ కుటుంబం ఏనాడూ ఎవరి దగ్గర చేయి చాంపింది లేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 10 నెలల్లోనే మీ గ్రాఫ్ 30 శాతానికి పడిపోయిందని అధికారం ఎవరికి శాశ్వతం కాదనే విషయాన్ని మీరు గుర్తుతెరిగి మాట్లాడాలని అన్నారు. మీ వెనకాల ఉన్న ప్రస్తుత తెలుగుదేశం నాయకులు , కార్యకర్తలు అందరూ కూడా 40 ఏళ్లుగా మా ఆర్ఆర్ కుటుంబం వెంట ఉండిన వారేనని,



రేపటి రోజున నీ అధికారం కోల్పోయిన మరుసటి రోజునే అక్కడున్న వారంతా ఇక్కడికి వచ్చే వారేనని నువ్వు గుర్తుంచుకోవాలి అని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ కూడా అభివృద్ధి జరగడంలేదని అన్ని పనుల్లో కక్కుర్తికి పాల్పడుతూ కమిషన్ల కోసం బ్రోకర్లను ఏర్పాటు చేసుకొని మీ జేబులు నింపుకుంటున్న విషయం నియోజకవర్గ ప్రజలు అందరూ గమనిస్తూ ఉన్నారన్నారు. దివంగత మాజీ మంత్రివర్యులు ఆర్ రాజగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, వారి కుమారులు గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఆర్ రమేష్ కుమార్ రెడ్డి హయాంలోనే రాయచోటి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెంది ప్రస్తుతం రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న విషయం మీరు గుర్తుంచుకోవాలన్నారు. అప్పట్లో వెలుగల్లు ప్రాజెక్టుకు పునాది రాయి వేసి అక్కడ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలు కరువు నుండి బయటపడతారనే సంకల్పంతోనే ప్రాజెక్టును ఆ రెండు కుటుంబాల వారు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పూర్తిచేసి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు,సాగునీరు అందించిన ఘనత వారికే దక్కుతుందన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ రెడ్డయ్య మాట్లాడుతూ నీ అనుచర వర్గం నీ దగ్గర చెప్పిన తప్పుడు మాటలు విని మా ఇంటి పై దౌర్జన్యానికి పాల్పడి మాపై దాడి చేసి మా ఇంట్లో ఆడవాళ్ళు అని కూడా చూడకుండా దాడి చేయించారు. నీ కింద పని చేసే ట్రాన్స్కో కాంట్రాక్టర్ గ్రామాలలో ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలంటే ఒక్కొక్క ట్రాన్స్ఫార్మర్ కు రూ .30 నుండి 50 వేలు వసూలు చేస్తూ రైతుల రక్తం పిల్చుకు తింటున్నాడని విషయం నీకు తెలియదా అంటూ మంత్రిని ప్రశ్నించారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి వెంట ఉంటూ ఊరూరా ఆస్తులు సంపాదించుకుని విలాసవంతమైన జీవితం గడుపుతున్న చంద్రశేఖర్ రెడ్డి నా గురించి రమేష్ రెడ్డి గురించి మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రజలకు సేవ చేసే మార్గాన్ని ఎంచుకోవాలని అన్నారు. అనంతరం కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్ మాట్లాడుతూ కంకర దొంగలించిన మంత్రి అనుచరులపై పోలీసులు కేసులు బనాయించాల్సింది పోయి , కనీసం కేసు కూడా పెట్టకుండా అక్కడున్న టిప్పర్లను జెసిబిలను పంపించి వేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ చొరవ చూపి కంకర దొంగతనానికి పాల్పడిన వారి పై కేసులు నమోదు చేసి , చట్టం ఎవరు చుట్టం కాదని చట్టపరిధిలో అధికారం ఉన్నా , లేకున్నా అందరూ సమానమే అనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు అంబాబత్తిన రెడ్డెయ్యా , ఉపాధ్యక్షుడు సిద్దక రామచంద్రా రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, చంద్రాయుడు, గడ్డం ప్రభాకర్ రెడ్డి, కేశవయ్య, ఎంపీటీసీ రమణమ్మ, మూగి శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ రాజేంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్సీపీ యూత్ నాయకులు కాలాడి వినయ్ కుమార్ రెడ్డి,మైనార్టీ నాయకులు చాన్ భాషా, జాకీర్, సీఎం బాషా, ఖాజా,టెంకాయల బాషా, అన్వర్, బాబ్జాన్, నవాజ్, గౌస్ పీర్,మాజీ సర్పంచ్ లు భువనేశ్వర్ రెడ్డి, సుబ్బరాజు,దుర్గయ్య, పీలం నాగేంద్ర, రెడ్డెన్న, ఉప సర్పంచ్లు రాజా రెడ్డి, సంజీవ రెడ్డి,వైఎస్ఆర్సీపీ ఈ నాయకులు రవిరెడ్డి, సెల్వరాజ్, వరుణ్ కుమార్, రాఘవ రెడ్డి, మార్ల రావిరెడ్డి, వెంకట్రామరాజు, కాలడి నాగిరెడ్డి,, నారద, లక్ష్మిరెడ్డి, నాగిరెడ్డి, నాగిరెడ్డి, రెడ్డి శేఖర్, రాఘవ రెడ్డి, ఓబులేసు, పెద్ద ఓబులేసు , రొండ చలపతి ,వెంకటరమణ,గంగయ్య, తదితరులు ఉన్నారు.

# విచ్ఛిన్నకరమైన, అన్యాయమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించండి

**ఆవాజ్ రౌండ్ టేబుల్ డిమాండ్**

జనసముద్రం న్యూస్,విశాఖపట్నం,ఏప్రిల్15వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని ఆవాజ్ విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ మీటింగ్ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ చట్టం రాజ్యాంగంపై, మైనారిటీల హక్కులపై దాడి చేస్తోంది. దేశ లౌకిక కూర్పును దెబ్బతీస్తూ, మతపరంగా చీలికలను పెంచుతున్న ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చింది.ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఎ.అష్రఫ్ అధ్యక్షత వహించగా ఇందులో ముస్లిం సంఘాల పెద్దలు, మసీద్ పెద్దల్కైన మున్నీరు, అహ్మద్ఖాన్, అబిద్ బేగం, ఎదీన్, మున్నీషాలతో పాటు సిపిఐఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వవార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్లు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడిరచారు. ఈ రౌండ్ టేబుల్ మీటింగ్ ఈ క్రింది తీర్మానం చేసింది.గతంలో వున్న వక్ఫ్ చట్టం ..వక్ఫ్ఆస్తుల (ఇస్లామిక్ దానధర్మాలు) నిర్వహణకు సంబంధించి చట్టబద్ధమైన చట్రపరిధిని కలిగివుంది. ఆ ఆస్తుల సక్రమ నిర్వహణకు, రక్షణ హామీ కల్పిస్తోంది. మతపరమైన, దాతృత్వ సంబంధమైన ప్రయోజనాల కోసం వినియోగిస్తోంది. వక్ఫ్ ఆస్తుల క్రమబద్ధీకరణకు, వాటి దుర్వినియోగాన్ని, అనధికారిక విక్రయాలను నివారిం చేందుకు మార్గదర్శకాలను అందిస్తోంది.సవరించిన చట్టంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మార్పులు గత చట్టంలో పొందుపరిచిన ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలిగిస్తున్నాయి. ఈ సవరణ ద్వారా బిజెపి ప్రభుత్వం ప్రజలను చీల్చడానికి ఉద్దేశించిన తన హిందూత్వ ఎజెండాను ముందుకు తెస్తోంది. ముస్లింలు విచ్చలవిడిగా భూములను ఆక్రమించుకోవడానికి గత చట్టాన్ని





ఉపయోగించుకున్నారంటూ పదే పదే చెబుతోంది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ నుండి ముస్లిమేతరులను నిషేధిం చాలని ఇస్లామిక్ ఆదేశాలు వున్నప్పటికీ సవరించిన చట్టం ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డుల్లో చేర్చింది. ఇది, మతాన్ని ఆచరించుకునేందుకు ముస్లింలకు గల రాజ్యాంగ హక్కుపై దాడి చేయడమే. కనీసం ఐదేళ్ళుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నట్లు ముస్లిం రుజువు చేసుకోవడం తప్పనిసరి చేయడం ద్వారా సవరించిన చట్టం ముస్లింలను వేధించ డానికి మార్గాన్ని సుగమం చేసింది.మసీదులు తదితరాల నిర్మాణానికి అనేకమంది ముస్లిం యేతరులు కూడా సేవలందించారు. సవరించిన చట్టం కింద ఇక ఈ సోదర భావం, సౌభ్రాతృత్వం ప్రదర్శించడం సాధ్యం కాదు.వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40ని రద్దు చేయడంతో ఆస్తుల స్వభావాన్ని నిర్ణయించేందుకు గల అధికారాన్ని వక్ఫ్ బోర్డు కోల్పోనుంది. వక్ఫ్ ఆస్తులు ప్రధానంగా నాలుగు కేటగిరీలుగా వుంటాయి. దస్తావేజుల ద్వారా వక్ఫ్ (డాక్యు మెంట్ చేయబడిరది), మౌఖిక ప్రకటన ద్వారా వక్ఫ్ (నోటి మాటతో ప్రకటన), వినియోగం ద్వారా వక్ఫ్ (సుదీర్ఘకాలంగా వినియోగం ద్వారా నెలకొల్పబడిరది), ప్రభుత్వం మంజూరు చేసిన భూములు. కొత్త సవరణల కింద, దేశంలోని మెజారిటీ వక్ఫ్ ఆస్తులను (నోటి మాట ద్వారా ప్రకటించినవి లేదా దీర్ఘకాలంగా వినియోగిస్తున్నవి) ఇక ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. వక్ఫ్



ఆస్తులు పెద్ద మొత్తంలో వున్న ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాలు ప్రతిపాదిత సవరణల ద్వారా ఈ ఆస్తులను లక్ష్యంగా చేసుకుని స్వాధీనం చేసుకునే పరిస్థితులను ఎదుర్కోవాల్సిఉంటుంది.వక్ఫ్ ఆస్తులను నిర్ధారించే అధికారాన్ని సర్వే కమిషనర్ నుండి ప్రభుత్వం నియమించిన రెవిన్యూ అధికారులకు బదిలీ చేయడం ద్వారా ఆరాధనా స్థలాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, వృత్తివిద్యా కేంద్రాలను స్వాధీనం చేసుకోవాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా వుంది. తద్వారా వక్ఫ్ ఆస్తులపై పట్టును కేంద్ర ప్రభుత్వం మరింత పెంచుకోనుంది. దీర్ఘకాల వినియోగం ద్వారా చారిత్రకంగా వక్ఫ్ ఆస్తులుగా భావిస్తున్న వాటిని రిజిస్ట్రేషన్ చేయాలన్న కొత్త ఆదేశం వాటిని జప్తు చేయాలనే ప్రభుత్వ రహస్య ఎజెండాను బట్టబయలు చేస్తోంది. వక్ఫ్ ట్రిబ్యునల్కు గల అధికారాలను రద్దు చేయడం ద్వారా వక్ఫ్ బోర్డు తాను సేవలందించే కమ్యూనిటీకి దూరమైపోతుంది ఈ సవరణల ద్వారా, ముస్లింల హక్కులను రద్దు చేయాలన్న తన ఎజెండాను కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) ప్రత్యేక ఉద్దేశ్యాన్ని ఇది ప్రతిబింబిస్తోంది. దేశ లౌకిక, ప్రజాతంత్ర కూర్పును పరిరక్షించేందుకు లౌకికవాదులు, ప్రజా స్వామ్య భావజాలం కలిగిన పౌరులందరూ ఈ విచ్ఛిన్న కరమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేసేందుకు ఒక్క తాటిపైకి కలిసి రావాలని కోరింది

# మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారు

**మీ సవాళ్లను మా నాయకుడు అంత దూరం వద్దు మేము స్వీకరిస్తున్నాం**

**వీరభద్ర స్వామి గుడికి ఎప్పుడు రమ్మన్నా మేము వస్తాం**

**రాయచోటి అభివృద్ధి చందడం నచ్చకే వైసీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారు**

**మీడియా సమావేశంలో మండల యువ నాయకుడు యనమల మదనమోహన్**

లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15 రాష్ట్ర రవాణా,యువజనక్రీడా శాఖ మంత్రులు శ్రీ మండపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు ఆయన కుటుంబ సభ్యుల పై అసత్య ఆరోపణలు చేస్తే సహించమని లక్కిరెడ్డిపల్లి మండలం నాయకుడు యనమల మదనమోహన్ మీడియా సమావేశంలో పేర్కొన్నాడు . లక్కిరెడ్డిపల్లి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యనమల మదన్మోహన్ మాట్లాడుతూ ఎవరో కంకర తీసుకొనిపోతే అది మంత్రి కుటుంబ సభ్యులపై, ఆరోపణలు చేయడం తగదన్నారు. మంత్రిపై ఆరోపించడం తగదని సూచించాడు వీరభద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు మా మంత్రి అవసరం లేదు.. మేము సిద్ధం... మీరు ఎప్పుడు రమ్మన్నా మేము వస్తాము అని వైసిపి నాయకులకు తెలియజేశాడు 2024 ఎన్నికల్లో నువ్వు వైసీపీ నుంచి 11 కోట్లు డబ్బులు తీసుకున్నావని వీరభద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు మేము సిద్ధం...మా నాయకుడు 40 లక్షలు తీసుకున్నాడని నువ్వు ప్రమాణం చేయడానికి సిద్ధమా?మా సవాల్ ను స్వీకరించు... మీ సవాలను మేము స్వీకరిస్తాం మా నాయకుడు మంత్రి రాంప్రసాద్ రెడ్డి పైన, మంత్రి కుటుంబం పై అసత్య ఆరోపణలు చేయడం తగదు...మా నాయకుడు నీతి, నిజాయితీ గురించి మీరు మాట్లాడుతుంటే దయ్యాలు



వేదాలు వల్లించినట్లు ఉన్నాయి...ఏ పార్టీ అధికారంలో ఉన్నా కూడా మీ పనులు మీరు చేసుకుంటూ పోతున్నారు...మా నాయకుడు ఎవ్వరి కాళ్లు పట్టుకుని టికెట్ తెచ్చుకోలేదు. ..ప్రజా ఆదరణ, సమర్థమంత నాయకుడు కాబట్టే చంద్రబాబు నాయుడు మా నాయకుడికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు...వైసిపికి కంచుకోట అయినా పులివెందుల తర్వాత రాయచోటి అని అందరూ చెప్పుకుంటారు అలాంటి రాయచోటి ప్రజలు మా నాయకుడికి ఓట్లు వేసి గెలిపించారు...మంత్రి చేపట్టే అభివృద్ధి ని చూసి ఓర్వలేకనే రమేష్ కుమార్ రెడ్డి అసత్య ఆరోపణ చేస్తున్నారు..మంత్రి పై, మంత్రి కుటుంబం పై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే సహించేది లేదు యనమల మదన్ తెలియజేశాడు ... ఈ కార్యక్రమంలో మాజీ ఏపిఐసిసి చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్ రెడ్డి, ఆరీఫ్, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్, జయరాములు,సిద్ధక వెంకటరామిరెడ్డి , దేవానంద్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, మూగి వెంకటరమణ, సుధీర్, కావలి ఆంజనేయులు,వొట్టికాళ్ల వెంకటరమణ, సయ్యద్ మక్సుద్, మల్లీ, తెలుగుదేశం పార్టీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# క్రికెట్ పోటీలో విజేతగా నిలిచిన ఎస్ఆర్కె టీం.

లింగపాలెం, జనసముద్రం న్యూస్,ఏప్రిల్ 15

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ జట్టు సభ్యునిగా క్రికెట్ ఆడి యువతకు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. ఎస్ఆర్కెటీం మొదటి టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని 6 వికెట్ల నష్టానికి 12 ఓవర్లకు 134 పరుగులు చేసింది. రెండవ జట్టు ఆడమిల్లి టీం 4 వికెట్ల నష్టానికి 12 ఓవర్ల ముగిసే సరికి 67 పరుగులు చేసింది. 67 పరుగుల తేడాతో మొదటి బ్యాటింగ్ చేసిన జట్టు విజేతగా ఎస్ఆర్కె టీం నిలిచింది. ఈ ఆటలు వారం రోజులు పాటు ఇంకా కొనసాగుతాయని క్రికెట్ నిర్వాహకులు పాతూరి మురళీ, నత్తా నాగేంద్ర తెలియజేసారు.





## ఘనంగా శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలు

జనసముద్రం న్యూస్ ఏప్రిల్15 (పామిడి)

పట్టణంలో ఉన్న పెన్నా నదిలో వెలసిన కోదండ రామాలయంలో మంగళవారం సాయంత్రం సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహించారు ప్రతి సంవత్సరం చైత్ర మాసం నవమి తరువాత 9 రోజున చేస్తారు పెన్నా నదిలో ఉన్న రామాలయం లో మోటార్ బాలన్న వంశస్థులు భక్తుల మధ్య సాయంత్రం 6.30గంటలకు అరిగేల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధనుంజయ, వెంకటేశ్వర్లు కల్యాణ కర్తలు గా వ్యవహరించరు. గొల్లపల్లి మహాదేవయ్య అర్చకత్వంలో జరిపారు. సీత రామ ప్రవరలు, కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం సీత లక్ష్మణ శ్రీరాముల వారి ప్రాకరోత్సవం చేశారు భక్తాదులు హాజరుయ్యారు.



## పీచు పదార్ధాలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి.

జన సముద్రం న్యూస్ ,ఏప్రిల్ 15.పుల్లల చెరువు .

పీచు పదార్ధాలు,ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్ వైజర్ శివలక్ష్మి అన్నారు.పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా పుల్లల చెరువు సచివాలయం 1 లో అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తల కువంటల పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ శివలక్ష్మి మాట్లాడుతూ,మన పరిసరాల్లో లభించే కొర్రలు,, వారిగాలు,సజ్జలు,రాగులు,జొన్నలు,ఆరికలు వంటి చిరుధాన్యాలు తినడం వలన ఆరోగ్యం మెరుగుపడుతుంద ని,అదే విధంగా ఊబకాయం తగ్గించవచ్చని,రక్తహీనతను అధిగమించవచ్చని, అదేవిడిజంగా పీచు పదార్ధాలు,ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని,ఏ విటమిన్ పుష్కలంగా వుండే క్యారెట్,బీట్రూట్, గుడ్లు,పాలు ఎక్కువగా తీసికోవాలని తల్లులకు ఆమె అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## జై భీమ్ సంఘం ఆధ్వర్యంలోఅంబేద్కర్ జయంతి ఘనంగా జరిగింది

జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 15 ద్వారకాతిరుమల మేజర్ పంచాయతీసామాజిక న్యాయం అంటరాని తనం నిర్మూలన వంటి హక్కుల కోసం పోరాడిన మహానీయులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్134 పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగింది, ముందుగా ద్వారకాతిరుమల గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాల వేయడం జరిగింది, జై భీమ్ సంఘం ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి జై భీమ్ అని గ్రామంలో బైక్ ర్యాలీ నిర్మించారు,ద్వారకా తిరుమల గ్రామ సర్పంచ్ స్వర్ణలత మాట్లాడుతూ, అంబేద్కర్ జీవితంలో ఎన్ని ఒడిదురుకులలు ను ఎదుర్కొని ఉత్తమమైన విద్య ను రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న మహానీయుడు అంబేద్కర్ దళిత వర్గాలకు కోసం పోరాడిన అంటరాని వాడిగా చూసిన రాజ్యాంగం కోసం పోరాడిన మహానీయుడు అంబేద్కర్ ప్రతి ఒక్కరు తమ పిల్లలను చదివించి వారి బంగార భవిష్యత్తు కు బాట నిర్మించాలని కోరారు, ఈ కార్యక్రమంలో జై భీమ్ సేవా సంఘం కమిటీఆధ్వర్యంలో ద్వారకాతిరుమల మండలంలో ఉన్న ఎస్సీ కులస్తులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



## అంబేద్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శం:- ఎర్ర రాజు

జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 14: డిండి :-బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నల్లగొండ జిల్లా(గుండ్లపల్లి) డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామంలో జాంభవ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ జాంభవ యూత్ అధ్యక్షులు ఎర్ర రాజు మాట్లాడుతూ ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని ఆయన అన్నారు.బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జాంభవ యూత్ ప్రధాన కార్యదర్శి జంతుక శ్రీనివాస్,గ్యార వెంకటేష్,కాంగ్రెస్ మండల నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి,యూత్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి,బిజెపి యువ మోర్చా నాయకులు మేళ్ల సాయి,సోమిడి నాగరాజు ,గ్రామ యువత పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

### -దూరవిద్య ద్వారా ఉపాధి అవకాశాలు

### -జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



జనసముద్రం న్యూస్:(ఏప్రిల్ 15) కరీంనగర్.కరీంనగర్ జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి,ఇంటర్ పరీక్షలు రాస్తున్న వారంతా శ్రద్ధతో చదివి 100 శాతం ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆకాంక్షించారు.ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్,పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు,వారి తల్లిదండ్రులతో మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సన్నద్ధత సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఏ చిన్న ఉద్యోగానికైనా,ఉపాధి అవకాశాలకైనా విద్యార్హతలు ముఖ్యమని అన్నారు.అందుకే జిల్లా యంత్రాంగం తరపున గత తొమ్మిది సంవత్సరాలుగా 10వ తరగతిలో ఫెయిల్ అయిన పలువురు విద్యార్థులను గుర్తించి గత ఏడాది పదవ తరగతి పరీక్ష రాయించిన విషయాన్ని గుర్తు చేశారు.వీరిలో 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించి ఉన్నత చదువుల్లో చేరారని అన్నారు.అనారోగ్యం,వివాహం, కుటుంబ పరిస్థితులు వంటి వివిధ కారణాల చేత చాలామంది పాఠశాల విద్యను మధ్యలోనే ఆపేసిన వాళ్ళు ఉన్నారని, వారంతా ఓపెన్ స్కూల్లో చేరాలని సూచించారు.ఓపెన్ స్కూల్ విద్యార్హత రెగ్యులర్ అర్హతకు సమానమేనని అన్నారు.దూర విద్య ద్వారా ఉన్నత విద్య అభ్యసించి అనేకమంది ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారు ఉన్నారని తెలిపారు.ఈనెల 20 నుండి నిర్వహించనున్న ఇంటర్, పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఫీజు చెల్లించిన విద్యార్థులంతా తప్పక హాజరై పరీక్ష రాయాలని సూచించారు.పాస్ అయిన తర్వాత దూరవిద్యలో డిగ్రీలో చేరాలని సూచించారు.ఓపెన్ స్కూల్ తరగతులు గ్రంథాలయాల్లో నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని విద్యాధికారులను ఆదేశించారు.జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు మాట్లాడుతూ పదవ తరగతికి 421 మంది,ఇంటర్ కి 881 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు.చదువు మధ్యలో ఆపిన వాళ్ళు రానున్న విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ లో చేరాలని సూచించారు.ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సిహెచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## డిండిలో పోషణ పక్ష కార్యక్రమం

జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15: డిండి :-

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ పక్ష కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా(గుండ్లపల్లి) డిండి మండల కేంద్రంలోని 1వ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం పోషణ పక్ష కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ మాట్లాడుతూ పోషక విలువలు మరియు న్యూట్రిషన్ గురించి వివరించారు.ఇందులో భాగంగా అంగన్వాడి కేంద్ర పరిధిలోని వచ్చిన ప్రతి ఒక్క గర్భిణి,బాలింతలు,ప్రీస్కూల్ పిల్లలు మరియు లబ్ధిదారుల తల్లిదండ్రులుకు పోషక విలువలు,ఆకుకూరల్లో ఉండే పోషక విలువలను న్యూట్రిషన్ ఫుడ్ గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు మంగమ్మ, సత్యవాణి,లావణ్య,ఆయా నాగమణి,ఆశ వర్కర్ సరిత, తల్లులు పుష్ప,రజిత,సునీత, ప్రేమలత, స్వప్న,లావణ్య హేమలత,రజిత తదితరులు పాల్గొన్నారు.



## కొట్లాట కేసులో ముగ్గురు రిమాండ్

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా (ఏప్రిల్.15)

జనసముద్రం న్యూస్ ఘట్కేసర్ మున్సిపల్ కొండాపూర్ లోని కూలర్ కంపెనీలో పని చేసే రియాజ్ ఉద్దీన్ కి మరియు ముగ్గురు నిందితులు మహమ్మద్ తాబరేజ్,ఇక్లాక్ మరియు ప్రకాష్ రామ్ కి మధ్య పని చేసే విషయంలో ఒక నెల క్రితం గొడవ కాగా,అది మనసులో పెట్టుకున్న ముగ్గురు నిందితులు కలిసి తేదీ 13.04.2025 రోజున రాత్రి అందాజా 10:30 సమయంలో రియాజ్ ఉద్దీన్ వద్దకు వెళ్లి ఇనుప పైపుతో కొట్టగా రియాజ్ ఉద్దీన్ కాలర్ బోన్ విరిగినది. రియాజ్ ఉద్దీన్ ఫిర్యాదు మేరకు సోమవారం రోజున కేసు నమోదు చేసి మంగళవారం రోజున ముగ్గురు నిందితుల్ని రిమాండ్ కై తరలించనైనది.




## బీసీల అంశాలపై కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పించిన బీసీ ఆజాది సమాఖ్య నాయకులు

జనసముద్రం న్యూస్:(ఏప్రిల్ 15)హుజురాబాద్.దేశవ్యాప్తంగా కుల గణాంకాలు నిర్వహించాల్సిన అవసరం, తెలంగాణ బీసీ బిల్లులను రాజ్యాంగంలోని తొమ్మిదవ అనుబంధంలో చేర్చేందుకు,అలాగే మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులకు భారతరత్న పురస్కారం ప్రకటించేందుకు కమిషన్ తరఫున చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ కార్యాలయంలో చైర్మన్ హన్సరాజ్ గంగారాం జీని బీసీ ఆజాది సమాఖ్య జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జక్కని సంజయ్ మాట్లాడుతూ,జనాభా ఆధారంగా బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించేందుకు కుల గణాంకాలు అత్యంత అవసరమని తెలిపారు.మొదటి బీసీ కమిషన్ కాకా కలేల్కర్ కమిషన్,రెండవ బీసీ కమిషన్ బీపీ మండల్ కమిషన్ కూడా ఇదే సూచించాయని,అయితే గత ప్రభుత్వాలు ఈ అంశాన్ని పట్టించుకోకపోయాయని విమర్శించారు.2018లో రాజ్యసభలో రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం కుల గణాంకాలు చేపడతామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు.1881 నుంచి 1931 వరకూ కుల గణాంకాలు నిర్వహించబడ్డాయని,దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇవి నిర్లక్ష్యం చేయబడ్డాయని తెలిపారు.ప్రస్తుతం దేశ వ్యాప్తంగా కుల గణాంకాలు నిర్వహించాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోందని, ఇందుకు ఇండియా కూటమి, ఎన్డీఏ కూటమిలోని అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాయని పేర్కొన్నారు. కాబట్టి ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకొని తమ కమిషన్ ద్వారా కుల గణాంకాల ప్రక్రియ ప్రారంభించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే కుల గణాంకాలు నిర్వహించబడ్డాయని, బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లు ప్రస్తుతం గవర్నర్ వద్ద ఉందని తెలిపారు.ఆ బిల్లును అమలులోకి తేవాలని, పార్లమెంటులో చట్టం చేసి రాజ్యాంగంలోని తొమ్మిదవ అనుబంధంలో చేర్చేందుకు ప్రయత్నాలు చేయాలని కోరారు.సామాజిక ఉద్యమాలకు ఆద్యులు అయిన మహాత్మ జ్యోతిరావు పూలే,సావిత్రిబాయి పూలే దంపతులకు భారతరత్న అవార్డు ప్రకటించాలని ఇందుకు కమిషన్ తరఫున ముందడుగు వేయాలని కోరారు.దేశవ్యాప్తంగా కుల గణాంకాల కోసం బీసీ ఆజాది జేఏసీ నాయకుడు బత్తుల సిద్ధేశ్వర పటేల్ గత 15 రోజులుగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు.ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది సమాఖ్య నేతలు బత్తుల రాం నర్సయ్య,కొంగర నరహరి,విజయ్ కుమార్,చతుర్భుజ్ పాల్గొన్నారు.



## తవక్లాపూర్ లో ఘనంగా అంబేద్కర్ జయంతి

జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15: డిండి :-

నల్లగొండ జిల్లా (గుండ్లపల్లి) డిండి మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.సిపిఐ గ్రామ కార్యదర్శి వంకేశం చక్రి మాట్లాడుతూ,అంబేద్కర్ ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని,వారి కృషి ఫలితంగానే బడుగు బలహీన వర్గాలు అందరూ స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యనమల నవీన్,ఎలిమినేట్ నరేష్,ఎండి ఆదిల్,గోరటి చంటి, బాలకృష్ణ,సీతారాం రెడ్డి యనమల్ల శీను తదితరులు పాల్గొన్నారు.



## ఆలేరు అడ్వకేట్ బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

జన సముద్రం న్యూస్ జిల్లా ప్రతినిధి బిబియాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆలేరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. తాజా మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూకంటి రవీందర్ అధ్యక్షతన బార్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహించారు.అధ్యక్షులు మిరియాల వనమరాజు,అధ్యక్షతన ఎన్నికల అధికారులు హనుమంతు, సిద్ధులు,మురళీకృష్ణ నేతృత్వంలో ప్రమాణ స్వీకారం చేశారు.ఇటీవల జరిగిన బార్ ఎన్నికల్లో అధ్యక్షులుగా మిరియాల వనమరాజు ఎన్నికయ్యారు. ఆయనతోపాటు ఉపాధ్యక్షుడుగా తుంగ హరికృష్ణ,ప్రధాన కార్యదర్శిగా ఎండి చాంద్ పాషా,సహాయ కార్యదర్శిగా రావుల రవీందర్, కోశాధికారిగా ఫారునది రవికుమార్ లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,తమ ఎన్నికకు సహకరించిన న్యాయ వాదులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా న్యాయవాదుల హక్కుల కోసం కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ అధ్యక్షుడు జూకంటి రవీందర్ పాల్గొని నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు.






## వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

### - వేములకొండ నుండి యాదగిరిగుట్ట వరకు

### బిఆర్ఎస్వి,బిఆర్ఎస్వై ఆధ్వర్యంలో పాదయాత్ర

యాదాద్రి భువనగిరి జిల్లా (ఏప్రిల్.15)జనసముద్రం న్యూస్ భువనగిరి:-బిఆర్ఎస్ పార్టీ 24 వసంతాలు పూర్తిచేసుకొని 25 వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభసందర్భంగా ఈ నెల 27 న వరంగల్ లో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్వి,బిఆర్ఎస్వై ఆధ్వర్యంలో వలిగొండ మండలం వేములకొండ శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహ ఆలయం నుండి యాదాద్రి వరకు చేపట్టిన పాదయాత్రను ప్రారంభించిన మాజీమంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి,భువనగిరి మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్,కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,బూడిద బిక్షమయ్య గౌడ్,బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్,డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మరియు బిఆర్ఎస్ రాష్ట్ర,జిల్లా నాయకులు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, బిఆర్ఎస్వి, బిఆర్ఎస్వై, జిల్లా నాయకులు,మండలాల అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన తలారి నరసింహా

వెల్దండ,ఏప్రిల్,16(జనసముద్రం న్యూస్)కల్వకుర్తి ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతోనే బైరాపూరు గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు తలారి నరసింహ అన్నారు, మంగళవారం అండర్ డ్రైనేజీ పనులను నరసింహ ప్రారంభించారు ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి నిధులతో గ్రామంలో పూర్తిస్థాయిలో అండర్ డ్రైనేజీ పనులను కొనసాగిస్తామని అన్నారు, త్వరలోనే అండర్ డ్రైనేజీ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు,ఈ కార్యక్రమంలో శీను నాయక్, కొడుపూరి చెన్నయ్య,మాజీ వార్డు మెంబర్ నల్ల ఎల్లమ్మ,కొడుపూరి అంజమ్మ,నల్ల పెద్ద జంగయ్య,బుర్రె అంజయ్య,బుర్రె బాల నరసింహ, జోగు శేఖర్, జంగమ్మ,లక్ష్మమ్మ, మంగలి సత్తయ్య,కోర మైపాల్ తదితరులు పాల్గొన్నారు






## వైయస్సార్ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఘన సన్మానం

జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 16 హుజూర్నగర్ నియోజకవర్గ ఆర్సి అలవాలరవి హుజూర్నగర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్నేహశీలి సౌజన్యమూర్తి ఉపాధ్యాయులు సామూహిక సేవా తత్పరుడు మానవతావాది విద్య రత్న దళిత రత్న అవార్డు గ్రహీత శ్రీ మాతంగి ప్రభాకర్ రావు పదవి విరమణ వీడ్కోలు మహోత్సవం నియోజకవర్గ స్థాయిలో అక్షర సన్మానోత్సవం శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించినారు ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది కొనియాడారు అట్వాంటే వృత్తిలో కొనసాగి పదవి విరమణ చేస్తున్న శ్రీ మాతంగి ప్రభాకర్ రావు గారి దంపతులను కొనేయాడుతూ ఘనంగా సన్మానించడం జరిగినది పేద విద్యార్థులకు తన వంతు సేవలందించారు పాఠశాల అభివృద్ధిలో పాల్గొని తనవంతు కృషి చేసినారని తెలిపినారు

## హుజురాబాద్ హాకీ క్లబ్ కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా తోట రాజేంద్రప్రసాద్



జనసముద్రం న్యూస్:(ఏప్రిల్ 15)హు జురా బాద్. హుజురాబాద్ హాకీ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .పట్టణం లోని హైస్కూల్ క్రీడా మైదానంలో ఎన్నికలు జరిగాయి.అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, గుడ్డెలుగుల సమ్మయ్య ఆధ్వర్యంలో ఈ కమిటీ ఎన్నిక జరిగింది. నూతనంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులు: అధ్యక్షుడు: తోట రాజేంద్రప్రసాద్, సెక్రటరీ: బొడిగ తిరుపతి గౌడ్,ఉపాధ్యక్షులు: భూసారపు శంకర్, ఆరెల్లి రమేష్, వేముల రవికుమార్,డి. యూసుఫ్,జాయింట్ సెక్రటరీలు: శ్యాంసుందర్,సిహెచ్.రాజు,జి. ప్రదీప్,ఎన్. సాయి కృష్ణ,ట్రెజరర్: ఎం.రాజేష్,ఆర్గనైజింగ్ సెక్రటరీలు: కె.రాజేష్, ఎస్.విక్రమ్, యు. భాస్కర్ రెడ్డి,ఎం.వినయ్,పి. సాంబరాజు,కోచ్:ఎం. విక్రమ్,సలహాదారులు: జి. సమ్మయ్య, పవన్ కుమార్, బీ. రఘు,సిహెచ్.శ్రీనివాస్,కె.బిక్షపతి, జాని,ఎన్. బాలరాజు ,కార్యవర్గ సభ్యులు: పరబ్రహ్మం,సన్నీ,వినీత్, విపుల్,రోహన్,రాజకుమార్, వంశీ, ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత 30 సంవత్స రాలుగా హాకీకి మేము సేవలు అందించాము. అనేక టోర్నమెంట్లను విజయవంతంగా నిర్వహించాం.ఇకపై కూడా హాకీ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేస్తుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు సజ్జు తదితరులు పాల్గొన్నారు.



## గుమ్మల హన్సిక పుట్టినరోజు సందర్భంగా అంగన్వాడి స్కూల్లో పిల్లలకు పలకలు బహూకరణ.

జన సముద్రం న్యూస్ జిల్లా ప్రతినిధి బిబి

భువనగిరి మండలం అనంతారం గ్రామంలో బిఆర్ఎస్ యూత్ నాయకులు గుమ్మల మధు కుమార్తె గుమ్మల హాన్సిక పుట్టినరోజు సందర్బంగా గ్రామం లోని అంగన్వాడీ స్కూల్లో కుమార్తెతో కేక్ కట్ చేయించి పిల్లలకు పలకలు బహూకరించడం జరిగిందిఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ చిందం మల్లిఖార్జున మాజీ వార్డు సభ్యులు గుమ్మల గణేష్ సింగిరెడ్డి సుధామోహన్ రెడ్డి పల్లెపాటి రవికుమార్ అంగన్వాడీ టీచర్స్ సింగిరెడ్డి వసంత కొత్తపల్లి సరిత తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా సైనికులే కాంగ్రెస్ పార్టీకి బలం

జన సముద్రం న్యూస్ జిల్లా ప్రతినిధి బిబిభువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డిలిఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ: కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి రావడానికి ముఖ్య కారకులు సోషల్ మీడియా సైనికులే అని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు, మంగళవారం నాడు పెద్ద అంబర్ పేటలోని తన క్యాంప్ కార్యాలయంలో భువనగిరి పార్లమెంట్ సోషల్ మీడియా సైనికులతో సమీక్షా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలపై వారికి దిశా నిర్దేశం చేశారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రజాపాలన అందిస్తుందనీ సన్న బియ్యం, ఉచిత విద్యుత్తు, 500 కు గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువకులకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం ఇలా పలు రకాల పథకాలను ప్రవేశపెట్టి ప్రజల కోసం పనిచేస్తుందనీ వీటన్నిటి గురించి ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చెయ్యాలని సూచించారు, ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా పార్టీ నాయకత్వాన్ని బలపరచాలని అన్నారు, కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని, పనిచేసిన గారికి ఖచ్చితంగా సరైన సమయంలో సరైన పదవులు, సముచితమైన గౌరవం ఇస్తుందని తెలిపారు, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కంకణబబద్దులు కావాలని పిలుపునిచ్చారు...ఈ



కార్యక్రమంలో పలు నియోజకవర్గాల నుండి సోషల్ మీడియా కోఆర్డినేటర్లు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వెల్ సెంటర్ ఏర్పాటు చేయాలని,

### ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ కు వినతి

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వెల్ నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. సోమవారం రోజున ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే మురళి నాయక్ ను కలుసుకొని, ఈ మేరకు వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పాత్రికేయుల సౌకర్యార్థం వెల్నెస్ సెంటర్ అవసరం ఉన్నది. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఇలాంటి కేంద్రం లేనందున, వైద్యం చేయించుకోవడానికి, హనుమకొండ కు వెళ్లవలసి వస్తున్నందున, ఈ కారణంగా తీవ్ర వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తున్నదని, ఎక్కువ శాతం ఎవరు ఈ సదుపాయాన్ని ఉపయోగించు కొనలేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించడం వలన ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుచాల్సి వస్తుందని , కనుక మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వెల్ నెస్ సెంటర్ ను ఏర్పాటు కోసం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రివర్యులకు మరియు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు తెలియపరచి, ప్రభుత్వ ఉద్యోగుల మరియు రిటైర్డ్, పాత్రికేయుల కుటుంబాల ఆరోగ్యాలను కాపాడుడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు అందించిన వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ వెన్ వెంటనే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వెల్నెస్ కేంద్రాన్ని ఏర్పాటు కోసం



రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో తెలంగాణ స్టేట్ కంట్రీబుటరి పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కే మోబిన్ అహ్మద్, మున్సిపల్ ఎంప్లాయిస్ జేఏసీ కమిటీ నాయకులు సింగు రమేష్, ఉపాధ్యాయ సంఘం నాయకులు రఫిక్, మున్సిపల్ ఎంప్లాయిస్ ప్రతినిధి భారత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు డ్యూటీ అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్ష

**పోలీసు వ్యవస్థపై విశ్వాసం నిలబెట్టాలంటే ప్రతి అధికారి తన విధులను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించాలి**

**ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐపీఎస్**




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ ఏప్రిల్ 15 మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐపీఎస్ మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ నందు కోర్టు డ్యూటీ నిర్వహిస్తున్న అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, న్యాయ సంబంధిత విధుల్లో నిర్లక్ష్యం అంగీకరించదగినది కాదని, ప్రతి కేసు విచారణలో చార్జ్‌షీట్లను నిర్దేశిత కాల వ్యవధిలో న్యాయస్థానాలకు సమర్పించాల్సిన అవసరం ఉందని అధికారులను ఆదేశించారు.అలాగే కోర్టు విచారణకు సంబంధించి సాక్షుల హాజరును నిర్ధారించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందిగా



స్పష్టం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో సమన్వయాన్ని మెరుగుపరచి కేసుల పరిష్కార వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అనుమానితులను కోర్టుకు హాజరు పరచే సమయంలో వారిని సురక్షితంగా, సమయానికి న్యాయస్థానాలకు తరలించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి భద్రతా లోపాలు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కోర్టు డ్యూటీలలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠినంగా వ్యవహరించబడుతుందని హెచ్చరించారు. న్యాయస్థానాల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసం నిలబెట్టాలంటే ప్రతి అధికారి తన విధులను నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తుదకు, కోర్టు డ్యూటీల నిర్వహణలో పటిష్టత తీసుకురావాలని, న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన లబ్ధిదారులకు వేగంగా సేవలందించాలి

**వేసవి నేపథ్యంలో ప్రజలకు త్రాగునీరు సరఫరాలో ఆటంకం కలగకుండా చూసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15 మహబూబాబాద్ జిల్లా,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అని నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ తదితర యువకులకు ఉపాధి కల్పన నిమిత్తం ఈ పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని, ప్రభుత్వ సూచించిన లక్ష్యాల ప్రకారం లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకం ఇబ్బందులు లేకుండా రుణ సదుపాయం కల్పించాలని కలెక్టర్ కోరారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లాలోనీ బ్యాంకర్స్ ,సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసి అర్హులైన లబ్ధిదారులకు లక్ష్యాల ప్రకారం రుణాలు అందించాలని సూచించారు. దివ్యాంగులకు ఐదు శాతం అవకాశం కల్పించాలని, ప్రభుత్వం ఒక మంచి సదుద్దేశంతో యువత స్వయం ఆర్థిక అభివృద్ధి చెందడం కోసం ఈ పథకం ప్రవేశపెట్టిందని వారికి కావలసిన సౌకర్యాలను అందించాలని తెలిపారు. రుణాలు అందించడంలో బ్యాంకర్లు లబ్ధిదారులకు సహకరించాలన్నారు.వేసవి నేపథ్యంలో జిల్లాలోని (1320), హ్యాబిటేషన్స్, మున్సిపల్ పరిధిలలో ప్రజలకు త్రాగునీరు అందించుటలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, మున్సిపల్ తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు.ఇప్పటికే సూచించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం త్రాగునీరు ఇబ్బందులు ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానిక సోర్సులను సమకూర్చుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు



తీసుకోవాలన్నారు,మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు ప్రతినిత్యం మండలంలోని గ్రామాల స్థితిగతులు, త్రాగునీరు సరఫరా, సానిటేషన్, తనిఖీ చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ తదితర మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయితీరాజ్ శాఖ అధికారులు, డిఈ లు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శి లతో ప్రజలకు త్రాగునీరు సరఫరాపై సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు, ఈ సమావేశంలో జడ్పీ సీఈవో పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, బిసి ఎస్సి ఎస్టి మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాసరావు, దేశీ రామ్, శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ మూర్తి, డిపిఓ హరిప్రసాద్, డిసిఓ వెంకటేశ్వర్లు, సిపిఓ సుబ్బారావు, డివిహెచ్ఓ కిరణ్ కుమార్, డిఎస్ఓ ప్రేమ్ కుమార్, డిడి సురేష్ గ్రౌండ్ వాటర్, మిషన్ భగీరథ ఈఈ కృష్ణారెడ్డి, డిఏఓ విజయనిర్మల, జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల పంచాయతీ విస్తరణ అధికారులు, ఏపిఏంలు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ న్యాయవాది సామ రాజేందర్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు

జన సముద్రం న్యూస్ జిల్లా ప్రతినిధి

భువనగిరి పట్టణంలోని ఘనంగా ప్రముఖ న్యాయవాది సామ రాజేందర్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు భువనగిరి కోర్టు న్యాయవాది సామ రాజేందర్ రెడ్డి గారి పుట్టినరోజు వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు హేరే కార్ శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా నిర్మించడం జరిగింది ఈ సందర్భంగా స్వీట్ కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశాము ఈ కార్యక్రమంలో నాయకులు న్యాయవాదులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
బుధవారం16,ఎప్రిల్,2025

# హుజురాబాద్ హాకీ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



జనసముద్రం న్యూస్ కరీంనగర్ ఏప్రిల్ 15
హుజురాబాద్ హాకీ క్లబ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో నీ హాకీ క్లబ్ ఆవరణలో అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్ గుడ్డేలుగుల సమ్మయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎకగ్రీవంగాఎన్నుకున్నారు. అధ్యక్షునిగా తోట రాజేంద్రప్రసాద్,సెక్రటరీగా బొడిగ తిరుపతిగౌడ్,ఉపాధ్యక్షులుగా,భూసారపుశంకర్, ఆరెల్లిరమేష్,వేముల రవికుమార్, ఎండి యూసుఫ్, జాయింట్ సెక్రెటరీగా శ్యాంసుందర్, సిహెచ్ రాజు, జి ప్రదీప్, ఎన్ సాయి కృష్ణ,ట్రెజరరిగా ఏం రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే రాజేష్, ఎస్ విక్రమ్, యు భాస్కర్ రెడ్డి, ఏం వినయ్, పి సాంబరాజు. కోచ్ గా ఎం విక్రమ్, సలహాదారులుగా జి,సమ్మయ్య, పవన్ కుమార్, బీ రఘు, సిహెచ్ శ్రీనివాస్, కే బిక్షపతి, ఇ.జాని, నల్ల బాలరాజు,కార్యవర్గ సభ్యులుగా పరబ్రహ్మం,సన్నీ, వినీత్, విపుల్, రోహన్,రాజకుమార్, వంశీ, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా హాకీ కి తోడ్పాటు అందిస్తూ అనేక టోర్నమెంట్లు నిర్వహించామని ,టోర్నమెంట్లు నిర్వహించేందుకు హాకీ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు సజ్జు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# డిటిఎఫ్ సైదాపూర్ మండల శాఖ అధ్యక్షునిగా సదాశివ్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరెడ్డి నియామకం



జనసముద్రంన్యూస్ కరీంనగర్ ఏప్రిల్ 15
డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సైదాపూర్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఇటీవల జరిగాయి. ఈ సందర్భంగా సైదాపూర్ మండల శాఖ ఎన్నిక కోసం ఎన్నికల పరిశీలకులుగా బొంగానీ రమేశ్ రాష్ట్ర కౌన్సిలర్, వోడ్నాల రాంకిరణ్ రాష్ట్ర కౌన్సిలర్ లు వ్యవహరించారు. అలాగే వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఏరియర్స్ ఇస్తూ, పి ఆర్ సి అమలు చేయాలని, ట్రెజరీలలో పెండింగ్ బిల్స్ క్లియర్ చేయాలని కోరారు. అనంతరం సైదాపూర్ మండల శాఖకు నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడుగా మండల సదాశివ్ ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ఎం పి ఎస్ అమ్మనగుర్తి, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ ఎస్ ఏ (జి యు జి) జెడ్ పిస్ ఎక్లాస్పూర్, ప్రతిమ ఎస్ ఏ (పి.డి) జెడ్ పి ఐ టి ఎస్ వెంకెపల్లి, ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరెడ్డి ఎస్ ఏ(మ్యాస్ జెడ్ పి హెచ్ ఎస్ )దుద్దెనపల్లి, కార్యదర్శులుగా గిరిధర్ ఎస్ ఏ బి ఐ డి) జెడ్ పి హెచ్ ఎస్ వెంకెపల్లి, వెంకటరమణ ఎస్ జి టి పి ఎస్ గొల్లగూడెం, ఆడిట్ కమిటీ కన్వీనర్ భాగ్యలక్ష్మి ఎస్ ఏ (బి ఐ ఓ) దుద్దెనపల్లి, జిల్లా కౌన్సిలర్స్ సభ్యులు అజయ్ కుమార్ ఎస్ ఏ మరియు జెడ్ పి హెచ్ ఎస్ దుద్దెనపల్లి, బొంగాని రమేశ్ ఎస్ యు టి పి ఎస్ రాయికల్, వాడ్నీల రాంకిరణ్ ఎస్ ఏ (పి హెచ్ వై. ఎస్ సి) జెడ్ పి హెచ్ ఎస్ వెంకెపల్లి, బుర్రు శ్రీనివాస్ ఎస్ జి టి పి ఎస్ ఎక్లాస్పూర్ లు ఎన్నికైనట్లు రామ్ కిరణ్, రమేష్ లు ప్రకటించారు. కాగా సదాశివ్, తిరుపతి రెడ్డి ఎన్నిక పట్ల పలు ఉపాధ్యాయులు, డిటిఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

# రాజీవ్ యువ వికాస్ పథకం గడువు ఏప్రిల్ 30వరకు పొడిగించాలి

## సిఎం డిప్యూటీ సిఎంలను ట్విట్టర్ ద్వారా కోరిన మద్దెల దినేష్



జనసముద్రం న్యూస్ : ఏప్రిల్ 15 ( పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ )
తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఆర్థిక సహాయం అందించేందుకు తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాస్ పథకం ఆన్లైన్ దరఖాస్తుల గడువు సోమవారంతో ఏప్రిల్ 14న ముగుస్తుండగా మరోసారి పొడిగిస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరిగుతుంది. కానీ తీరా దరఖాస్తు చేసుకుందామని సంబంధించిన వెబ్సైట్ ఓపెన్ చేయడంతో దరఖాస్తు గడువు 14వ తేదీతో ముగిసిందని, వెబ్సైట్ క్లోజ్ చేశామనే సమాచారంతో నిరుద్యోగుల్లో గందరగోళం ఏర్పడిందన్నారు. అనంతరం పెద్దపల్లి జిల్లాకు చెందిన ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అర్హులైన ఐదు లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రారంభించడం జరిగిందని, అయితే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవడంలోని పలు సమస్యలను గుర్తించిన ప్రభుత్వం తొలుత ఈనెల 14 వరకు గడువు పొడిగించినప్పటికీ చివరి మూడు రోజుల నుండి సర్వర్ ప్రాబ్లంతో అనేక మంది నిరుద్యోగులు దరఖాస్తూ చేసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేసారు.

మరోసారి ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో నిరుద్యోగులు సంతోషించారు. కానీ దరఖాస్తు చేసుకోవడానికి మీ సేవకి వెళ్లి ప్రయత్నించగా సంబంధిత వెబ్సైట్ లో మాత్రం దరఖాస్తు గడువు ముగిసిందని ఉండడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కావున ఏప్రిల్ 30వ తేది వరకు ప్రభుత్వం పొడగించాలని, ఎలాంటి టెక్నీకల్ సమస్యలు లెకుండా చూడాలని తాహసిల్దార్ కార్యాలయాలలో సిబ్బంది నిరద్యోగులను ఇబ్బందులు పేట్టకుండా చూడాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ప్రభుత్వాన్ని ఆదేశాలు జారి చేయాలని డిమాండ్ చేశారు.

# వాహన తనిఖీల్లో నిషేధిత గంజాయి పట్టివేత

జనసముద్రం న్యూస్, పినపాక, ఏప్రిల్ 15.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, బయ్యారం గ్రామపంచాయతీ, ఉప్పాక బ్రిడ్జి వద్ద పోలీసులు నిషేధిత గంజాయిని పట్టుకున్నారు. మంగళవారం సాయంత్రం ఎస్సై రాజ్ కుమార్ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు పాసింజర్ ఆటోలో తోగూడెం గ్రామం వెళ్తున్నామని ఎక్కి 1కేజీ 300 గ్రాములు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు.ఆ ఇద్దరిని తోగ్గుడెం గ్రామానికి చెందిన లోకేష్, ఆదిత్యగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వారి వద్ద నుండి మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని,



ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజ్ కుమార్ తెలిపారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకే రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తు తేదీ పొడిగించాలి

## -బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు చింతకింది వేణు



మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా (ఏప్రిల్.15)
జనసముద్రం న్యూస్ ఘట్కేసర్:-
బిసి,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయం రాజీవ్ యువ వికాసం పథకం మూడు రోజులు సెలవుల కారణంగా చాలామంది యువకులు పూర్తిగా దరఖాస్తు చేసుకోలేకపోయారు.కావున దరఖాస్తు గడువు పొడిగించాలని బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు చింతకింది వేణు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# తొరూర్ పట్టణ కేంద్రంలో షీ టీమ్స్ పకడ్బంధిగా ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పట్ల మధు, జిల్లా గర్ల్స్ నాయకురాలు శ్రీగిరి రేణుక
- ఎస్ఎఫ్ఐ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో తొర్రూర్ సి.ఐ గణేష్ కు వినతిపత్రం అందజేత



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి
జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15
మహబూబాబాద్ జిల్లా తోరూర్ మండలం పట్టణ కేంద్రంలో షీ టీమ్స్ ని పకడ్బందీగా ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పట్ల మధు, జిల్లా గర్ల్స్ నాయకురాలు శ్రీగిరి రేణుక డిమాండ్ చేశారు ఈ సందర్భంగా తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తొడూరు సిఐ గణేష్ కు వినతిపత్రం అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ తొరూర్ పట్టణ కేంద్రంలోని రిక్షా కాలనీ వైపు గర్ల్స్ హాస్టల్స్ మరియు పాఠశాలలో ఉండడంవల్ల అబ్బాయిలు నిత్యం అటువైపు తిరుగుతూ విద్యార్థినిలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలియజేశారు.. పట్టణ కేంద్రంలోని బస్టాండ్ లో సాయంత్రం కాగానే బస్టాండ్ కొచ్చే విద్యార్థినిలను ఆకతాయిలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం షీ టీమ్స్ పకడ్బందీగా అమలు చేస్తామని చెబుతున్న తొరూర్ పట్టణ కేంద్రంలో సరిగా అమలు కావడం లేదని విమర్శించారు కావున పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే నేటి నుండి పట్టణ కేంద్రంలో ప్రత్యేక పెట్రోల్ అని సిఐని కోరారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా నాయకులు గుండ్ల రాకేష్ తొరూర్ మండల ఉపాధ్యక్షులు మహేష్ మండల నాయకులు త్రిష సందీప్ రిషి మహేష్ ప్రవీణ్ ప్రమోద్ వినోద్ తదితరులు పాల్గొన్నారు

# క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభం

## పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ,ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



జనసముద్రం న్యూస్ ఏప్రిల్15 రామకృష్ణాపూర్:
క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజల దశాబ్దాల కళ నెరవేరింది క్యాతనపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభమైన వేల పుర ప్రజానీకం మురిసింది. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశి కృష్ణ,చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా హాజరై బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ వంశి కృష్ణ మాట్లాడారు.ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు బ్రిడ్జి సమస్య ప్రధాన అంశంగా ఉండేదని, ఎమ్మెల్యే గా వివేక్ గెలిచిన సంవత్సర కాలంలో బ్రిడ్జి పనులు పూర్తి చేస్తామని ఇచ్చిన మాటప్రకారం ప్రజల కోరిక నెరవేర్చామని తెలిపారు.కరోనా సమయంలో నిలిచిన అజ్ని ప్యాసింజర్ రైలును పునరుద్ధరించడం జరిగిందని పేర్కొన్నారు. సింగరేణిలో కాక వెంకటస్వామి మొదలు పెట్టిన పెన్షన్ స్కీంను నేడు పది వెలకు పెంచాలని సంబంధిత మంత్రికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని,త్వరలోనే పెన్షన్ పెరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే అ్న రైలును రవీంద్రఖని రైల్వే స్టేషన్ లో నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. అనంతరం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వేంకటస్వామి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన మూడు నెలల్లోనే బ్రిడ్జిని ప్రారంభించాలనిదృఢంగాఉన్నప్పటికీ గుత్తేదారుడుకి రావల్సిన నిధులు, భూ నిర్వాసితులకు అందాల్సిన నష్ట పరిహారం పూర్తి స్థాయిలో రాకపోవడంతో కొంత ఆలస్యమైందని, వెంటనే వారికి రావల్సిన నిధులు మంజూరు చేయించి పనులను వేగవంతం చేయడం,బ్రిడ్జిని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.ఈ మున్సిపాలిటీలో రోడ్లు,డ్రెయినేజీలు, మంచినీటి సౌకర్యార్థం కొరకు స్పెషల్ డెవలప్మెంట్ నిధులు మంజూరు చేపించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు.అలాగే విద్యా,వైద్య రంగానికి పెద్ద పీట వేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో రెండు వంద కోట్ల రూపాయలతో నూతన ఓరవడితో విద్యాలయాన్ని నిర్మిస్తామని తెలియజేశారు. అలాగే సన్నబియ్యం, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్,ఐదు వందల రూపాయలకే వంట గ్యాస్ ఇవ్వడంతో పాటు,రాజీవ్ యువ వికాసం ద్వారా నిరుద్యోగ యువకులకు నాల్గు లక్షల రూపాయల రుణాలను త్వరలోనే మంజూరు చేస్తానని, ప్రతి నిరుద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి,అధికార ప్రతినిధి శ్రీనివాస్,జంగం కళ,సాగర్ రెడ్డి, నాయకులు గాండ్ల సమ్మయ్య,అబ్దుల్ అజీజ్,యాకూబ్ అలీ,నీలం శ్రీనివాస్ గౌడ్,మహిళా నాయకురాళ్లు నరెడ్ల కల్పన,పుష్ప,దీప, స్వాతి,మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ఘట్కేసర్ లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అవగాహన ర్యాలీ

## -ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్










మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా
(ఏప్రిల్.14) జనసముద్రం న్యూస్
ఘట్కేసర్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాల యాదవ్ ఆధ్వర్యంలో ఏఐసీసీ, టీపీసీసీ పిలుపుమేరకు ఘట్కేసర్ మున్సిపల్ లో జై బాపు,జై భీమ్జై సంవిధావ్ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ నియోజక వర్గం కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్,మేడ్చల్ నియోజక వర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్,మేడ్చల్ జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్,మాజీ సర్పంచ్ మేడబోయిన వెంకటేష్ ముదిరాజ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన బర్ల రాధాకృష్ణ ముదిరాజ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్ట జనార్దన్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ లు కడపోల్ల మల్లేష్,కుతాడి రవీందర్,రైతు సమన్వయ కమిటీమాజీఅధ్యక్షుడుకొంతంఅంజిరెడ్డి,ఉపాధ్యక్షులు కోరుబోతు నాగరాజు ముదిరాజ్,వాజిద్,మాజీ వార్డు సభ్యులు బొక్క ప్రభాకర్ రెడ్డి,బర్ల దేవేందర్ ముదిరాజ్,మామిండ్ల చితారి యాదవ్,మీసాల సుధాకర్ రావ్,విబి వెంకట్ నారాయణ ముదిరాజ్,డిసిసి కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు యాదవ్,మైనారిటీ సెల్ అధ్యక్షులు ఫరూక్,ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎం శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా కార్యదర్శి కార్తీక్ యాదవ్,ఎస్టి సెల్ అధ్యక్షులు సురేష్ నవావత్,సేవాదళ్ అధ్యక్షులు రాజారత్నం యూత్ ఉపాధ్యక్షులు రఫీయుద్దీన్, మైనారిటీ సెల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ ఖయ్యూమ్ భాయ్,సీనియర్ నాయకులు కే.నర్సింగ్ రావ్,అక్తర్ భాయ్,మేకల సునీల్ కుమార్,సిరాజ్ భాయ్,గోద గణేష్ యాదవ్,తోక మల్లేష్,మైనారిటీ సెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ అశ్రాఫ్ అలీ,నాయకులు కందకట్ల మాధవ రెడ్డి,శివరాత్రి సురేష్,కడపొల్ల రాజు,రాము,నరసింహ,విజయ్,వేణు,కిరణ్,చారి తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్ లో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి
జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15
మహబూబాబాద్ జిల్లా అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్ లో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది ఇప్పుడు వేసవి కాలం కాబట్టి ప్రజలుఅగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని మహబూబాద్ జిల్లా అగ్నిమాపక అధికారి సంక్రాంతి శ్రీనాథ్ తెలియజేస్తూ ప్రజలు అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని వారికి అవగాహన కల్పించడం జరిగింది



ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బి కృష్ణ లీడింగ్ ఫైర్ మాన్ కే రవీందర్ లీడింగ్ ఫైర్ మాన్ ఎండి షఫీ గోపి వెంకన్న పూర్ణచందర్ విశ్వనాథ్



పాల్గొనడం జరిగింది వీరితోపాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొనడం జరిగింది

# హైదరాబాదులో తెలంగాణ బ్రాహ్మణ సంఘాల ఐక్యతా సమ్మేళనం.



జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 15 బ్యూరో చీఫ్.
హైదరాబాద్ నాగోల్ వసంత్ విహార్ ఫంక్షన్ హాల్లో తెలంగాణ బ్రాహ్మణ సంఘాల ఐక్య తా సదస్సు బ్రాహ్మణ ప్రముఖులు శ్రీ బసవరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఘనంగా జరిగింది. ఈ ఐక్యతా సమ్మేళనానికి తెలంగాణలోని అన్ని జిల్లాల నుండి బ్రాహ్మణ సంఘాల వారు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఈ సమావేశంలో తెలంగాణ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామా వజ్జల. రవికుమార్ ప్రసంగిస్తూ భారత అభివృద్ధి ప్రదాత మాజీ ప్రధాని భారతరత్నస్వర్గీయ శ్రీ పీవీ నరసింహారావుఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 24 మంది ఎమ్మెల్యేలు 5గురు ఎంపీలు 6 గురు రాజ్యసభ సభ్యులు బ్రాహ్మణ సమాజం నుండి ప్రాతినిధ్యం వహించారని, క్రమేపి ఆ సంఖ్య పూర్తిగా తగ్గిపోతూ వస్తోందని, గత దశాబ్దన్నర కాలంలో ఉభయ తెలుగు రాష్ట్రాల క్యాబినెట్ బ్రాహ్మణులకు అవకాశం లభించలేదని, ప్రస్తుత ఏపీ ప్రభుత్వంలో బ్రాహ్మణ మంత్రి లేకపోవడంతో బ్రాహ్మణులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని, రవికుమార్ తెలిపారు. తమ ప్రభుత్వంలో బ్రాహ్మణునికి అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని బ్రాహ్మణ సమాజం ఐక్యంగా లేకపోవడం వల్ల చట్టసభలలో నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల పంపిణీలో బ్రాహ్మణులకు తగు ప్రాతినిధ్యం లభించడం లేదని బ్రాహ్మణ ప్రముఖులు తెలియజేశారు. బ్రాహ్మణ ఐక్యత గురించి నడుం బిగించిన శ్రీ బసవరాజు శ్రీనివాస్ కు ఈ సమావేశం ధన్యవాదాలు తెలియజేసింది. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్యవర్గంలో తెలంగాణలోని అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం విజ్ఞప్తి చేసింది.

బ్రాహ్మణ ఐక్యతకు కృషి చేస్తున్న శ్రీ బసవరాజు శ్రీనివాస్ గారిని బ్రాహ్మణ సంఘాల ప్రధాన నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాహ్మణ సమస్యల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బ్రాహ్మణ సమాజానికిన్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ నేతలు కోరారు. బ్రాహ్మణులందరి సహకారంతో బ్రాహ్మణ ఐక్యతకు తన వంతు కృషిచేసి, ప్రభుత్వం ద్వారా బ్రాహ్మణులకు సహాయం అందే విధంగా కృషి చేస్తానని బసవరాజు తెలిపారు. తమ ప్రధాననేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు బ్రాహ్మణ సంఘాల వారికి ధన్యవాదాలు తెలిపారు.

5 వందల మందికి పైగా బ్రాహ్మణులు పాల్గొన్న ఈ సభలో మహిళలు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ సభలో సాయంత్రం 5 గంటల వరకు బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూ లంకశంగా చర్చించి న బ్రాహ్మణ ప్రముఖులు నివారణకు తగు సూచనలు చేశారు.

# గ్రాడ్యుయేషన్ డే ద్వారా భవిష్యత్తుపై అవగాహన శ్రీ కృష్ణవేణి హై స్కూల్ ప్రిన్సిపల్ దేవన్న







జనసముద్రం న్యూస్, జైపూర్ ఏప్రిల్ 15:
మంచిర్యాల జిల్లా నస్పూర్ పరిధిలోని శ్రీ కృష్ణవేణి హై స్కూల్ లో మంగళవారం రోజున గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దేవన్న మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే ద్వారా పిల్లలకు తమ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవడం ఎలా అనే అంశంపై అవగాహన తీసుకురావడం కోసం జరుపుకుంటామన్నారు.

బాల్యంలో నుండే విద్యార్థులకు విద్యతో పాటు సామాజికస్పృహ,నైతిక విలువలు,మంచి వ్యక్తిత్వంతో కూడిన ప్రవర్తన,ఉన్నతమైన జీవనశైలి వంటి విషయాలపై అవగాహన కల్పిస్తూ,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

పిల్లల జ్ఞాపకశక్తిని మెరుగుపరిచే విధంగా చెకుముకి టాలెంట్ టెస్ట్,జనరల్ నాలెడ్జ్,ముఖ్యమైన అంశాలపై క్విజ్ పోటీలు పెడుతూ వారి మేధశక్తిని పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే మంచి ఆరోగ్యాన్ని పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తూ,కరాటే,యోగా లాంటి వివిధ కార్యక్రమాలలోకూడావిద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా వారి ప్రతిభను గుర్తించేందుకు సాధన చేస్తున్నామని,పోటీల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సాహకారంగా ఉండేలా ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందని అన్నారు.

**తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి**

విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి వేసవి సెలవులలో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని,ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది కాబట్టి వడదెబ్బ తాకే ప్రమాదం, ఇతర అనారోగ్యాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కనుక విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి హై స్కూల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు,విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# సి.సి.రోడ్డు కు మోక్షం కలిగేనా...?

## జిల్లా పంచాయతీ అధికారి పర్యవేక్షణ చేయాలి.






జనసముద్రంన్యూస్ 16ఏప్రిల్
జమ్మికుంట (టౌన్) ప్రతినిధి:
కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోగల ఇల్లందకుంట (అపర భద్రాద్రి) మండలం "టేకుర్తి" గ్రామంలో సిసి రోడ్లకు మోక్షం లభించడం లేదని గ్రామస్తులు, సామాజిక కార్యకర్తలు, ఓటర్లు మొరపెట్టుకుంటున్నారు. "టేకుర్తి" గ్రామంలోని ఐదవ, ఆరవ వార్డు సమీపంలో గల పోచమ్మ టెంపుల్ నుండి ట్రాన్స్ ఫార్మర్ వరకు గల రోడ్డు పూర్తిగా మట్టితో నిండుకుపోవడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. టేకుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, స్పెషల్ ఆఫీసర్ దివ్య మేడం, ఇల్లందకుంట మండలం ఎంపిఓ, ఎంపీడీవో, తహసీల్దార్, జిల్లా పంచాయతీ అధికారి (డి.పి.ఒ) తక్షణమే స్పందించి అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ టేకుర్తి గ్రామం లో పర్యటించి తగువిధంగా పనులు ప్రారంభించాలి.

టేకుర్తి గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ పాలన కాలంలో నిర్వహించిన సభలు , తీర్మానాలు, క్షేత్రస్థాయిలో అమలు చేసే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని గ్రామస్థులు, సామాజిక కార్యకర్తలు,ఓటర్లు తమ ఆవేదనను వెల్లడిస్తున్నారు.

# నెరవేరిన దశాబ్దాల కల





జన సముద్రం న్యూస్ జైపూర్ ఏప్రిల్ 15:
చెన్నూరు నియోజకవర్గం పరిధిలోని క్యాత నపల్లి మున్సిపాలిటీ ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న న్న రైల్వే గేటు బాధలు తీరిపోయాయి, హైదరాబాద్ నుండి ఢిల్లీ ప్రధాన రైల్వే మార్గం లో ప్రజలు రాకపోకలు సాగించే మార్గంలో గేటు ప్రతి పది నిమిషాలకు ఒకసారి రైల్వే అధికారులు వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు, 2009 పెద్ద పెల్లి ఎంపీగా గెలిచిన గడ్డం వివేక్ వెంకటస్వామి తన పార్లమెంట్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో 2013 వ సంవత్సరంలో రైల్వే శాఖ అనుమతి ఇవ్వడంతో పనులు ప్రారం భం అయ్యాయి కానీ తర్వాత అనేక అనంతరాలు అనంతరం 2023వ సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికలలో చెన్నూరు నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికల బరిలో నిలిచిన గడ్డం వివేక్ వెంకటస్వామి గెలిచిన వెంటనే రైల్వే ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు దానికి అనుగుణంగా వారి కుమారుడు పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సహకారంతో పలుమార్లు అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి రైల్వే ఓవర్ బ్రిడ్జిని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు, మంగళవారం రోజున పెద్దపల్లి ఎంపీ గడ్డ వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి రైల్వే ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు

# లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదించిన వక్ఫ్ ఎమెండ్‌మెంట్ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాల.



కొడంగల్ మండల్ ఏప్రిల్ 15
జన సముద్రం న్యూస్ .
ఈ నెల 18న (శుక్రవారం) ప్రత్యేక ప్రార్థనల అనంతరం కొడంగల్ పట్టణంలోని వినాయక చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొడంగల్ జామే మస్జీద్ కమిటీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేయడం జరుగుతుంది.లి ఈ కార్యక్రమంలో జామే మస్జీద్ కమిటీ అధ్యక్షుడు అఫ్రోజ్, మక్కా మస్జీద్ ఇమామ్ అబ్దుల్ కరీం, ఎస్. బీ. గుల్షన్, ఫెరోజ్ ఖాన్, ఎండీ. సర్తజ్ హుసేన్, షేక్ రోమన్, ఎండీ. అజహర్, ఎండీ. అమీర్ హుసేన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ లో ఎలక్ట్రానిక్ బైక్ దగ్ధం..

## గంటల వ్యవధిలోనే పూర్తిగా దగ్ధం



జనసముద్రం న్యూస్ కరీంనగర్ ఏప్రిల్ 15
హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి రోడ్డు అహల్య నగర్ బస్టాండ్ వద్ద ఎలక్ట్రిక్ (ఎడిఎంఎస్–) బైక్ పేలి మండిపోయింది. కొంచెం సమయం లోనే బైకు పూర్తిగా కాలిపోయింది.హుజూరాబాద్ ఫైర్ సేఫ్టీ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా బైకు కు సంబంధించిన వారెవరు కనిపించకుండా పారిపోయారు అని స్థానికులు తెలిపారు.

